తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 216 | శుక్రవారం 27 –12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in



# ఇకపై బెనిఫిట్ షోలు ఉండవు


- అసెంబ్లీలో చెప్పిన మాటకే కట్టుబడి ఉంటాం
- సినీ పరిశ్రమ డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రకటనలు వేయాలి
- బౌన్సర్లపై సీరియస్ గా ఉంటామని వెల్లడి శాంతిభద్రతల విషయంలో రాజీ ఉండదు ఫ్యాన్స్ కంట్రోల్ బాధ్యత సెలబ్రిటీలదే
- ఎవరిపైనా ఉద్దేశపూర్వకంగా కేసులు పెట్టలేదు
- భేటీలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు - కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ నాగార్జున, వెంకటేశ్, రాఘవేంద్రరావు. దగ్గుబాటి సురేశ్ లాంటి సీనియర్ల హాజరు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

సీఎం రేవంత్. రెడ్డితో సినీ ప్రముఖుల భేటీ ముగిసింది. ఈ సం దర్భంగా టాలీవుడ్ కు కాంగ్రెస్ సర్కార్ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న మంచి కార్యక్రమాలకు సినీ పరిశ్రమ సహకరించాలని, డ్రగన్ కు వ్యతిరేకంగా, మాదక ద్రవ్యాల నిర్మూలనకు సహాయం అందించాలంటూ సినీ ప్రముఖుల ముందు పలు ప్రతిపాదనలు ఉంచారు.



అదేవిధంగా బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపుపై సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. అసెంబ్లీలో చేసినప్రకటనకే కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ప్రతి సినిమా ప్రదర్శనకు ముందు డ్రగ్స్ కు వ్యతిరేకంగా యాడ్ ప్లే చేయాలన్నారు సినిమా టికెట్లపై విధించే సెస్సును ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి వినియో గించాలని తెలిపారు. బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపు ఉండదని తేల్చిచెప్పారు. ఉద్దేశపూర్వకంగా ఎవరిపైనా కేసులు పెట్టలేదని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని సినీ ప్రముఖులకు పోలీసులు చూపించారు. హైదరాబాద్ బంజారాహిల్స్లో స్లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో జరుగుతున్న ఈ సమావేశానికి దిల్ రాజు. అల్లు అరవింద్, బోయపాటి క్రీసు, సాయి రాజేశ్, సి కల్యాణ్, రామోదర ప్రసాద్, నాగవంశీ, కిరణ్ అబ్యనరం, యూవీ క్రియేషన్స్ అధినేత, రాఘు వేంద్ర రావు, త్రివిక్రమ్, హరీశ్ శంకర్, శివబాలాజి,నాగార్జున, వెంకటేశ్, మురళీ మోహన్, శ్యాం ప్రసాద్ రెడ్డి, వెంఎస్ రెడ్డి, డైరెక్టర్ శంకర్, మైత్రీ మూవీస్ అధినేత యలమంచిలి రవి దగ్గుబాటి సురేశ్, ప్రొ డ్యూసర్ సుధాకర్ రెడ్డి, గోపీ ఆచంట, వంశీ పైడిపల్లి తదితరులు హాజరయ్యారు. ఇక ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు భట్టి విక్రమా ర్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర్ రాజనరసింహ పాల్గొననున్నారు..



# మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కన్నుమూత

- ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

భారత మాప్రధాని మన్మోహన్ సింగ్ (92) ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి న్నుమూశారు. గురువారం సాయంత్రం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అంతకముందు మన్మోహన్ అస్వస్థతకు గురి కాగానే రాత్రి 8:06 గంటలకు ఎయిమ్స్‌కు తరలించి అత్యవసర విభాగంలో చికిత్స అందించారు. చికిత్స పొందుతూ రాత్రి 9:51 నిమిషాలకు ప్రాణాలు వదిలారు. మన్మోహన్ సింగ్ మరణాన్ని ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు అధికారికంగా ధృవీకరించారు.మన్మోహన్ సింగ్ సెప్టెంబర్ 26, 1932లో అప్పటి అవిభక్త భారతదేశంలోని (ఇప్పటి పాకిస్తాన్ పంజాబ్)లోని గాహ్‌లో జన్మించారు. ఆక్స్‌ఫర్ యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్‌లో డాక్టరేట్ పొందారు. ప్లానింగ్ కమిషన్ చీఫ్‌గా, ఎకనామిక్ అడ్వైజర్‌గా భారత ప్రభుత్వంలో కీలక పదవుల్లో పనిచేశారు. 1991 అప్పటి పీవీ నరసింహారావు మంత్రి వర్గంలో ఆర్థిక మంత్రిగా పనిచేశారు. భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన వ్యక్తిగా, సంస్కరణలకు శ్రీకారం చుట్టిన వ్యక్తిగా మన్మోసింగ్ ఘనత వహించారు. 2004 నుంచి 2014 వరకు యూపీఏ హయాంలో భారత ప్రధానిగా పనిచేశారు. 1982 సెప్టెంబర్ 15-1985 జనవరి 15 వరకు ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారు. 1987లో

మిగతా 2లో

## తెలంగాణలో నేడు ప్రభుత్వ సెలవు

# పార్టీ డొనేషన్లలో దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ టాప్-2

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

పార్టీ డొనేషన్లలో బీఆర్ఎస్ దేశ వ్యాప్తంగా రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐ) తన వెబ్ సైట్‌లో వివరాలను వెల్లడించింది. 202324 ఆర్థిక సంవత్సరానికి గానూ బీఆర్ఎస్ రూ.580 కోట్ల డొనేషన్లు పొందింది. రూ.2,244 కోట్లతో బీజేపీ టాప్‌లో నిలిచింది. కాంగ్రెస్ రూ.289 కోట్ల డొనేషన్లతో మూడో స్థానంలో నిలిచింది. ఏపీలో టీడీపీకి రూ.100 కోట్లు డొనేషన్లు వచ్చినట్లు ఈసీ వెల్లడించింది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ అత్యధికంగా డొనేషన్లు ఇచ్చినట్లు ఈసీ డేటా తెలిపింది. ఈ సంస్థ బీజేపీకి రూ.723 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.156 కోట్లు చెల్లించినట్లు వెల్లడించింది. ఇదే సంస్థ బీఆర్ఎస్ పార్టీకి రూ.85 కోట్లు, వైఎస్ఆర్ సీపీకి రూ.62.5 కోట్లు డొనేషన్లు ఇచ్చినట్లు స్పష్టం చేసింది. అయితే ఈ రెండు పార్టీలు ఈ సారి ఎన్నికల్లో ఘోర ఓటమిని చవిచూశాయి. బీఎస్పీ, బీజేడీ అసలు తమకు డొనేషన్లు రాలేదని స్పష్టం చేయడం గమనార్హం.




| పార్టీ | 2022-23 | 2023-24 |
|---|---|---|
| బీజేపీ | రూ.680.49 కోట్లు | రూ.2.244 కోట్లు |
| బీఆర్ఎస్ | రూ.683కోట్లు | రూ.580 కోట్లు |
| కాంగ్రెస్ | రూ.79.9 కోట్లు | రూ.289 కోట్లు |
| ఆప్ | రూ.37.1కోట్లు | రూ.11.1కోట్లు |
| సీపీఎం | రూ.6.1కోట్లు | రూ. 7.6 కోట్లు |

# అందుకే రాజకీయాలు మాట్లాడాల్సి వస్తోంది..

- రేవంత్‌కు హరీష్‌రావు సూటి ప్రశ్నలు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ నేతల బృందం పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడుతూ గాయపడిన శ్రీతేజ్‌ను కేసీఆర్ సూచనతో బీఆర్ఎస్ నేతలం పరామర్శించామని తెలిపారు. ''శ్రీతేజ్ కోలుకుంటున్నారు.. వైద్యానికి స్పందిస్తున్నాడు. స్పర్శ కూడా మెరుగైందని డాక్టర్లు చెబుతున్నారు. భగవంతుడి దీవెనలతో శ్రీతేజ్ కోలుకుని మళ్లీ మామూలు మనిషిలా బయటకు రావాలని కోరుకుంటున్నాం. కిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం భాస్కర్ రావు నేతృత్వంలో శ్రీతేజ్‌కు మంచి వైద్యాన్ని అందిస్తోంది. తొక్కిసలాటలో మరణించిన రేవతికి మా ప్రగాఢ సానుభూతి. తాను మరణిస్తున్నా కొడుకు శ్రీ తేజ్‌ను రక్షించుకోవడానికి రేవతి పడ్డ తపన మనం చూశాం. రేవతి అందరి మనసును కరిగేలా చేసింది'' అని హరీష్‌రావు పేర్కొన్నారు.''ఇక్కడ రాజకీయాలు




మాట్లాడే సందర్భం కాదు. ప్రతిపక్షాలపై సీఎం రేవంత్ నెపాన్ని నెడుతున్నపుడు రాజకీయాలు మాట్లాడలేక ఉండని పరిస్థితి. సంధ్య థియేటర్ ఘటన జరిగిన పది రోజులకు సీఎం, మంత్రులు స్పందించారు. గురుకులాల్లో చనిపోతున్న పిల్లల కుటుంబాలను రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గం ఎందుకు పరామర్శించలేదు. గురుకులాల పిల్లల మాతృ మూర్తుల

మిగతా 2లో




# గ్రూప్1 అభ్యర్థుల పిటిషన్లను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

గ్రూప్1 పరీక్షలపై కొంతమంది అభ్యర్థులు వేసిన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్లతో పాటు పలు అంశాలపై అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్ల అంశం తేలేవరకు గ్రూప్ 1 పరీక్ష ఫలితాలను ప్రకటించకుండా చూడాలని అభ్యర్థులు తమ పిటిషన్‌లో కోరారు. ఈ మేరకు ఫలితాలు నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని ఆ పిటిషన్‌లలో కోరారు. విచారించిన న్యాయస్థానం వారి పిటిషన్లను కొట్టివేసింది.

# ఆత్మహత్యలా.. హత్యలా?

- కామారెడ్డి జిల్లా అడ్లూర్ చెరువు ఘటనలో భిక్కనూరు ఎస్ఐ సాయికుమార్ మృతదేహం కూడా లభ్యం
- బుధవారం రాత్రే చెరువులోంచి కానిస్టేబుల్ శ్రుతి, నిఖిల్ శవాలు వెలికితీత
- ఒకేచోట, ఒకే సమయంలో 3 మరణాలు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

ఒకే సమయంలో, ఒకేచోట ఒక ఎస్ఐ, కానిస్టేబుల్, మరో యు వకుడు చనిపోవటం కామారెడ్డి జిల్లాలో కలకలం రేపుతోంది. భిక్కనూరు ఎస్ఐ సాయికుమార్ (32), బీబీపేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రుతి (30), బీబీ పేటకే చెందిన నిఖిల్ (29) అనే యువకుడి మృతదేహాలు జిల్లా కేంద్రానికి సమీపంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి



పెద్ద చెరువులో లభ్య మయ్యా యి.
శృతి, నిఖిల్ మృత దేహాలు బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత బయటకు తీయగా, గురువారం ఉదయం

మిగతా 2లో



# ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు బెయిల్

- షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన కోర్టు
- తనపై అక్రమ కేసులు పెట్టారని, ధర్మం గెలిచిందన్న ఎర్రోళ్ల శ్రీనివాస్
- కోర్టు నిబంధనలు పాటిస్తానన్న బీఆర్ఎస్ నేత

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు నాంపల్లి

మిగతా 2లో

# బీసీలంటే లెక్క లేదా..?

- బీసీ కులగణనపై బీజేపీ వైఖరి చెప్పాలి..
- ఎమ్మెల్సీ కవిత డిమాండ్

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

బీసీ కులగణనపై తమ వైఖరి ఏంటో బీజేపీ పార్టీ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలు, కామారెడ్డి డిక్లరేషన్ అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. బీసీలంటే బీజేపీకి లెక్క లేదా అని అడిగారు.గురువారం నాడు కుమ్మరి సంఘం నేతలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తన నివాసంలో కలిశారు. బీసీలు, ముఖ్యంగా కులవృత్తుల వారు ఎదుర్కొంటున్న సమస్యలను వారు ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ‌‌... బీసీలకు ఇచ్చిన



హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని స్పష్టం చేశారు. కేసీఆర్ కులవృత్తులకు అన్ని విధాలా మద్ధతిచ్చారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కులవృత్తులను కుదేలు చేస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా బీసీల సంక్షేమాన్ని, అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు.
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నా... బీజేపీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. బీసీలు

మిగతా 2లో

# మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కన్నుమూత



మొదటి పేజీ తరువాయి

పద్మవిభూషణ్ అవార్డు అందుకున్నారు. 2024 సంవత్సరం ప్రారంభంలో రాజ్యసభ నుంచి పదవీ విరమణ చేశారు. 33 సంవత్సరాల తర్వాత ఎగువ సభలో తన రాజకీయ ప్రస్థానాన్ని ముగించారు. పీవీ.నరసింహారావు నేతృత్వంలోని ప్రభుత్వంలో జూన్ 1991లో ఆర్థిక మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అస్సాం నుంచి ఎగువ సభలో ఐదు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించారు. 2019లో రాజస్థాన్‌కు మారారు. పార్లమెంటులో పెద్ద నోట్ల రద్దును మన్మోహన్ సింగ్ వ్యతిరేకించారు. దీన్ని "వ్యవస్థీకృత దోపిడీ మరియు చట్టబద్ధమైన దోపిడీ"గా మన్మోహన్ అభివర్ణించారు.

**విద్య..**

2004, మే 22న ప్రధాని మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆర్థిక సంస్కరణలతో భారత చరిత్రలో ముఖ్యుడిగా పేరు పొందారు. ఆర్థికశాస్త్రంలో 1952లో బ్యాచిలర్ డిగ్రీ, 1954లో మాస్టర్స్ డిగ్రీ పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి పొందారు. 1957లో కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్స్, 1962లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు.

**ఉద్యోగాలు..**

1957-59 : సీనియర్ లెక్చరర్, ఆర్థికశాస్త్రం
1959-63 : రీడర్, ఆర్థికశాస్త్రం
1963-65 : ప్రొఫెసర్, ఆర్థికశాస్త్రం, పంజాబ్ విశ్వవిద్యాలయం, చండీగఢ్
1969-71 : ప్రొఫెసర్, ఇంటర్నేషనల్ ట్రేడ్, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఢిల్లీ విశ్వవిద్యాలయం
1976 : గౌరవ ప్రొఫెసర్, జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఢిల్లీ విశ్వవిద్యాలయం

**రాజ్యసభ సభ్యుడిగా.**

మన్మోహన్ సింగ్ 1991 అక్టోబరు 1 నుంచి 2019 జూన్ 14 వరకు ఐదు పర్యాయాలు అస్సాం నుంచి రాజ్యసభ సభ్యునిగా పనిచేశారు. 2019 ఆగస్టు 20 నుంచి 2024 ఏప్రిల్ 3 వరకు రాజస్థాన్ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యునిగా పనిచేశారు.

### తెలంగాణలో నేడు ప్రభుత్వ సెలవు

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:** మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతి నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు శుక్రవారం సెలవు దినంగా ప్రకటించినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.అలాగే మన్మోహన్ మృతితో రాష్ట్రంలో వారం రోజులు సంతాప దినాలుగా పాటించాలని ఉత్తర్వులిచ్చింది.



# యువకుల ప్రాణం తీసిన ఫ్లెక్సీలు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

విద్యుదాఘాతంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలంలో చోటు చేసుకుంది. కొల్చారం ఎస్ఐ మహ మ్మద్ గౌస్ కథనం ప్రకారం.. కిష్టాపూర్ గ్రామా నికి చెందిన ఎక్కం యాదగిరి కుమారుడు నవీన్ (21), పసుపుల చిన్న వెంకటేశం కుమారుడు పసుపుల ప్రసాద్ (20) వారి వ్యవసాయ పొలంలో నారు మడికి నీరు పెట్టి, అడవి పందులు రాకుండా మంటలు పెట్టడానికి వెళ్లారు. కాగా, బుధవారం మెదక్ జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా వీరి పొలాలకు సమీపంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలు విద్యుత్ హైటెన్షన్ వైర్‌కు ఆనుకొని ఉండటంతో వాటిని ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ తీయకుండా వదిలేశాడు. అయితే, ప్రసాద్, నవీన్ ఫ్లెక్సీలు తీయడానికి ప్రయత్నించగా విద్యుత్ సరఫరా కావడంతో కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకొని నిర్లక్ష్యంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ మెదక్-నర్సాపూర్ జాతీ య రహదారిపై రాస్తా రోకో చేశారు. విషయం తెలుసుకున్న మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకొని బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇవ్వడంతో శాంతించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. ఇద్దరు యువకులు ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. మృతుల్లో ఒకరైన ప్రసాద్‌కి ఇటీవలే పెళ్లి కుదిరినట్లు గ్రామస్తులు తెలిపారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మెదక్ చేరుకొని యువకుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.25 వేల చొప్పున అందజేశారు.

## తెలంగాణలో 10 మండలాలు

# వెనుబడిన ప్రాంతాలు

- కేంద్రమంత్రి బండి సంజయ్



దేశ వ్యాప్తంగా 112 జిల్లాల్లో 500 ( మండలాలు) బ్లాక్ లను కేంద్రం గుర్తించిందన్నారు బండి సంజయ్. నారాయణపేట జిల్లా నర్వ మండలం రాయికోడ్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్రం 'సంపూర్ణత అభియాన్ 'స్కీం ను తీసుకొచ్చిందన్నారు. దీనిలో భాగంగా దేశంలోని 500 బ్లాక్ లలో తెలంగాణలో పది బ్లాకులను( మండలాలను) కేంద్రం గుర్తించిందన్నారు.


ఇందులో నారాయణపేట జిల్లాలోని నర్వ మండలానికి చోటు దక్కగా.. ఈ మండలంలోని పాతర్ చెడ్, రాయికోడ్ గ్రామాల్లో విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం, ప్రణాళిక శాఖ, భూగర్భ జల శాఖ డెవలప్‌మెంట్ పై ఫోకస్ పెట్టిందన్నారు. ఈ మండలాలలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకే కేంద్ర మంత్రులు పర్యటిస్తున్నారని చెప్పారు. నీతి ఆయుగ్ ద్వారా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు ఈ మండలాలకు వస్తున్నాయని చెప్పారు.

కేంద్ర సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా ప్రజల సమస్యలను వినడానికి తాము వచ్చామన్నారు బండి సంజయ్. పాఠశాలలకు, హెల్త్ సెంటర్లకు, అంగన్ వాడీ భవనాలకి గ్రామాల్లో ప్రత్యేకమైన నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నాయన్నారు. ఇవన్నీ సక్రమంగా ప్రజలకు అందుతున్నాయా లేదా దానిపై అధికారులతో సమీక్షిస్తామన్నారు బండి సంజయ్. నీతి ఆయుగ్ ద్వారా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా.. ములుగు జిల్లా, నారాయణపేట, గద్వాల్ ఇలా పలు జిల్లాల్లో పర్యటిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి చెందిన మండలాలతో దీటుగా ఈ మండలాలను అభివృద్ధి చేయడమే కేంద్ర ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని బండి సంజయ్ అన్నారు.

## సంక్రాంతి నుంచి రేషన్ కార్డుల

# దరఖాస్తుల స్వీకరణ

- అర్హు లైన పేదలకు కొత్త రేషన్ కార్డులు
- సంక్రాంతి నుంచి కొత్త దరఖాస్తుల స్వీకరణ
- ప్రజాపాలన దరఖాస్తులతో పాటు కొత్త దరఖాస్తులు



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

పేద ప్రజల ఆహార భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్‌కార్డుల ద్వారా రాయితీపై బియ్యం, ఇతర వస్తువులు అందిస్తున్నాయి. గత ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీపై దృష్టి సారించకపోవడంతో దరఖాస్తుదారులు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు.

ఆరేళ్లుగా కార్డుల జారీ నిలిపివేత

నగర శివార్లలో ఆరేళ్లుగా పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేశారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు వేలల్లో ఉన్నారు. కార్డుల్లో మార్పు చేర్పులకు దరఖాస్తు చేసుకున్న వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. 2018లో కేవలం ఒకసారి మాత్రమే కొన్ని కార్డులను జారీచేసి పలు కారణాలతో నిలిపివేశారు. పదేళ్లుగా కొత్తగా పెళ్లిళ్లు చేసుకున్న వారు, కార్డుల్లో పిల్లల పేర్లు నమోదు చేయాల్సిన వారంతా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు.

**లబ్ధిదారుల్లో అయోమయం**

రేషన్ కార్డుల జారీ కాకపోవడంతో రేషన్‌కార్డుతో పాటు వచ్చే ఆరోగ్యశ్రీ సేవలను పొందలేకపోతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డులను ముడిపెట్టడంతో కార్డులు లేని వారిలో అయోమయం నెలకొంది. ఇళ్ల మంజూరు, పెన్షన్లు, ఇతర ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోవడంతో కార్డులు లేని వారు ఇబ్బందులు పడుతున్నారు.

**ప్రభుత్వ ప్రకటనతో హర్షం**

కొత్తగా వివాహాలు చేసుకున్న వారికి అర్హత ఉన్నా.. రేషన్‌కార్డులు లేకపోవడంతో ఆహార భద్రతా పథకంతో పాటు పలు పథకాలకు దూరమవుతున్నారు. తాజాగా ప్రభుత్వ ప్రకటనతో దరఖాస్తుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

మేడ్చల్ -మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రస్తుతం 10,82,348 రేషన్ కార్డులు ఉండగా, 35,40,883 మంది లబ్ధిదారులుగా ఉన్నారు. ఇందులో మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో 5,32,938 రేషన్‌కార్డులు ఉండగా.. 17,18,351 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఏళ్లుగా రేషన్ కార్డులు అందకపోవడంతో కొంతమంది అర్హులు ప్రభుత్వ పథకాలకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

**ప్రజాపాలనలో..**

ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించింది. నగర శివారు 3.89 లక్షల దరఖాస్తులు పౌరసరఫరాలశాఖ అధికారులకు చేరాయి. తాజాగా సంక్రాంతి నుంచి కొత్త కార్డులను జారీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మరోసారి స్వీకరించే అవకాశాలున్నాయి. ఈ ప్రక్రియ కోసం అవసరమైన మార్గదర్శకాలు జనవరి మొదటి వారానికి కొలిక్కి రానున్నాయి.

**ఆదేశాలు రాగానే....**

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొత్తరేషన్ కార్డుల జారీకి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు ప్రకటించాయి. ప్రభుత్వ నిర్ణయం మేరకు ముందుకు సాగుతామని అధికారులు చెబుతున్నారు.

**రేషన్‌కార్డులు ప్రామాణికం**

ఉచిత బియ్యంతో పాటు ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసి, ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతి నుంచి కొత్త రేషన్‌కార్డులను జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వాటి కోసం.. దరఖాస్తు చేసుకున్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.




# అందుకే రాజకీయాలు మాట్లాడాల్సి వస్తోంది..

మొదటి పేజీ తరువాయి

శోకాన్ని సీఎం ఎందుకు గుర్తించడం లేదు. చట్టం అందరికీ సమానమే అంటున్న సీఎం రేవంత్ కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయి రెడ్డి ఆత్మహత్యకు కారణమైన వారిని ఇంతవరకు ఎందుకు అరెస్ట్ చేయలేదు.సాయిరెడ్డి రాసిన ఆత్మహత్య లేఖలో ఉన్న తన సోదరులపై రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోరు?. రేవంత్ రెడ్డి సోదరులను కనీసం పోలీస్ స్టేషన్‌కు కూడా పిలవరా?. సినీ ఇండస్ట్రీ రాష్ట్ర ప్రభుత్వం చర్చల గురించి రాష్ట్ర ప్రజలు ఏమనుకుంటున్నారో అందరికీ తెలుసు.. ప్రేమానురాగాలతో మనసులు గెలవాలి కానీ భయాందోళనలు సృష్టించి కాదు. రాష్ట్రానికి మంచి జరిగితే అందరం హర్షించాలి" అని హరీష్‌రావు చెప్పారు.



# ఆత్మహత్యలా.. హత్యలా?

మొదటి పేజీ తరువాయి

8.30 గంటలకు సాయికుమార్ మృతదేహం కూడా అదే చెరువులో దొరికింది. దీంతో వీరు ఎలా చనిపోయారు? ఇక్కడికి ఎందుకు వచ్చారు? ఇవి ఆత్మహత్యలా? లేక ఈ మరణాల వెనుక ఇంకా ఏదైనా కారణం ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన పోలీస్ శాఖను కూడా కుదిపేస్తోంది. మృతులు ముగ్గురికి చాలాకాలం నుంచి పరిచయం ఉండటంతో రకరకాల చర్చ జరుగుతోంది.

**అనుకోకుండా బయటపడిన ఘటన..**

ఈ మూడు మరణాల ఘటన కూడా అనుకోకుండా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సాయికుమార్ ఫోన్ స్విచాఫ్ వస్తోంద ని ఆయన కుటుంబ సభ్యులు బుధవారం పోలీస్ ఉన్నతాధికారులకు తెలపటంతో.. ఆయన మొబైల్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు గాలింపు చేపట్టారు. అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద సాయికుమార్, నిఖిల్ చెప్పులు, సెల్‌ఫోన్లు.. శ్రుతి మొ బైల్ కనిపించాయి. ఎస్ఐ కారు కూడా చెరువు సమీపంలో ఉండడంతో అనుమానం వచ్చిన పోలీసులు.. గజ ఈతగా ళ్లతో చెరువులో గాలించగా మరణాల మిస్టరీ బయటపడింది.

జిల్లా ఎస్పీ సింధుశర్మ, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి అక్కడే ఉండి గాలింపు చర్యలను పర్యవేక్షించారు. దాదాపు 12 గంటల పాటు ఈ ఆపరేషన్ కొనసాగింది. 3 మృతదేహాలకు ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం మధ్యాహ్నం పోస్టుమార్టం పూర్తిచేసి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అంతుచిక్కని కారణాలు: ఈ ముగ్గురి మరణం వెనుక గల కారణాలు ఏమిటన్నది అంతుచిక్కడం లేదు. వీరు ఎలా చనిపోయారన్నది పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతే తేలుతుందని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. అయితే, వీరి మరణంపై జిల్లాలో తీవ్రంగా చర్చ సాగుతోంది. ఎస్సై సాయికుమా ర్ బీబీ పేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన సమయంలో శ్రుతితో సన్నిహితంగా ఉండేవారని ప్రచారం జరుగుతోంది. నిఖిల్ ఇటు సాయికుమార్‌తో అటు శ్రుతితో క్లో జ్‌గా ఉండేవాడని సమాచారం. ముగ్గురూ ఒకేసారి చనిపోవ డంతో వారి మధ్య నడిచిన వ్యవహా రం ఏమిటన్నది ఇప్పుడు కీలకంగా మారింది.సాయికుమార్ స్వస్థలం మెదక్ జిల్లా కొల్చారం మండ లం కిష్టాపూర్ గ్రామం. 2018 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన.. 2022 ఏప్రిల్ 13న బీబీపేటలో ఎస్ఐ గా చేరారు. గత ఏడాది ఆగస్టు 1న భిక్కనూరు ఎస్ఐగా బదిలీ అయ్యారు. గాంధారి మండల కేంద్రానికి చెందిన శ్రుతి బీబీపేటలో 2021 నుంచి పనిచేస్తోంది. బీబీపేటకు చెందిన తోట నిఖిల్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూనే, కంప్యూటర్ల రిపేర్లు చేసేవాడు. పోలీస్‌స్టేషన్‌లో కంప్యూటర్లు మొరాయించినపుడు అతడే వచ్చి రిపేర్ చేసి వెళ్లేవాడని చెబుతున్నారు. ఈ క్రమంలో ఈ ముగ్గురికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కలిసి చనిపోయేదాకా ఎందుకు వచ్చిందన్నదానిపై పోలీసులు దృష్టి పెట్టారు.

నా కొడుకు పిరికివాడు కాదు: పోస్ట్‌మార్టం నిర్వహించిన కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్దకు మృతులకు టుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున చేరుకొని బోరున విలపించారు. తన కొడుకు కష్టపడి చదివి ఉద్యోగం సాధించాడని, ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని ఎస్ఐ సాయికుమార్ తండ్రి అంజయ్యకన్నీరుమున్నీరయ్యాడు. ఎవ రో ఒకరిని కాపాడే ప్ర యత్నంలో చనిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తంచేశారు. శ్రుతి తండ్రి పుండరీకం మాట్లా డుతూ.. ఈ ఘటన ఎలా జరిగిందనేది పోలీసులు తేల్చాలని కోరారు. నిఖిల్ చనిపోయిన విషయం పోలీసులు చెబితే తెలిసిందని అతని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్ఐ సాయికుమార్ చిన్నతనం నుంచి చదువు లో టాపర్. 2007-2008లో పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచాడు. ఇంటర్‌లోనూ మంచి మార్కులు సాధించారు. హైదారాబాద్‌లోని సీబీఐటీలో బీటెక్ కోర్సు పూర్తి చేశాడు. 2018లో పోస్టల్ డిపార్టుమెంట్, ఏఆర్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సిద్దిపేట జిల్లా చిన్న కోడూరులో ఎస్సైగా మొదటి పోస్టింగ్ సాధించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ, బీబీపేట, భిక్కనూరులో ఎస్సైగా చేశాడు. రెండు పర్యాయాలు ఎస్పీ సింధుశర్మ చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నాడు. 2022లో కర్నూల్ జిల్లా నంద్యాలకు చెందిన మహాలక్ష్మిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. మహాలక్ష్మి ప్రస్తుతం ఐదు నెలల గర్భవతి అని తెలిసింది.




# బీసీలంటే లెక్క లేదా..?

మొదటి పేజీ తరువాయి

ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్ లు అవ్వడం బీజేపీ పార్టీకి ఇష్టం లేదా అని ప్రశ్నించారు. బీసీ కులగణన విషయంలో ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదని సూచించారు. దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టం తీసుకొస్తే అన్ని రాష్ట్రాల్లో కులగణన జరుగుతుందని, కానీ కేంద్రం ఆ దిశగా అడుగులు వేయకపోవడం అంటే బీసీలపై ప్రేమ లేనట్లే మనం అర్థం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు.ఈ సమావేశంలో యునైటెడ్ ఫులే ఫ్రంట్ నాయకులు బొల్ల శివ శంకర్, తెలంగాణ రాష్ట్ర శాలివాన సంఘ నాయకులు దుగుంట్ల నరేష్, నిమ్మలూరి శ్రీనివాస్, రేపాక రాంబాబు, రావులకోల్ ఎన్, తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక సంఘం నాయకులు హకీంకారి సురేందర్, జికె జహంగీర్, జీకే పరమేశ్వర్, ఏ వెంకటేశ్వర్, జికె అఖిల బాయి పాల్గొన్నారు.

# ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు బెయిల్

మొదటి పేజీ తరువాయి



కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.5 వేల పూచీకత్తు, ఇద్దరి ష్యూరిటీలతో బెయిల్ మంజూరు చేసింది. పోలీసుల విచారణకు సహకరించాలని ఆదేశించింది. ఎర్రోళ్ల శ్రీనివాస్ రిమాండ్‌పై కోర్టులో వాదనలు జరిగాయి. అనంతరం కోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది.కోర్టు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఎర్రోళ్ల శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ... తనపై అక్రమ కేసులు పెట్టిన ప్రభుత్వంపై ధర్మమే గెలిచిందన్నారు. కోర్టు నిబంధనలు తప్పకుండా పాటిస్తానన్నారు. ఇలాంటి సమయంలో తనకు అండగా నిలిచిన కేటీఆర్, హరీశ్ రావు, పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనుక్షణం ఈ కేసు వ్యవహారాలను పరిశీలిస్తూ, బెయిల్ కోసం కృషి చేసిన పార్టీ లీగల్ టీమ్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# సీఎం మీటింగ్ లో జరగనివి కూడా జరిగినట్టు వార్తలు వేస్తున్నారు: దిల్ రాజు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో తెలుగు చిత్ర పరిశ్రమ పెద్దల సమావేశంపై మీడియాలో వస్తున్న కొన్ని కథనాల పట్ల ప్రముఖ నిర్మాత, ఎఫ్ డీసీ ఛైర్మన్ దిల్ రాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎంతో భేటీ అయిన తరువాత పలు మాధ్యమాల్లో ఫేక్ వార్తలు ప్రసారం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం మీటింగ్ లో అసలు జరగనివి కూడా జరిగినట్టు వార్తలు వేస్తున్నారని దిల్ రాజు మండిపడ్డారు.

సీఎం రేవంత్ రెడ్డితో మీటింగ్ చాలా బాగా జరిగిందని, 0.5 పర్సెంట్ కూడా నెగిటివిటీ లేదని స్పష్టం చేశారు. ఆయన తెలుగు సినీ ఇండస్ట్రీ పట్ల చాలా సానుకూలంగా ఉన్నారని వివరించారు.

గురువారం సమావేశంలో బెనిఫిట్ షోలు, టిక్కెట్ రేట్ల గురించి అసలు టాపిక్కే రాలేదు. పోలీసులు సంధ్య థియేటర్ దగ్గర జరిగిన వీడియోలు మాకు ప్రదర్శించలేదు. బౌన్సర్స్ విషయాన్ని మాకు డీజీపీ చెప్పారు. ప్రతిదీ జవాబుదారీతనంతో ఉండాలి అని డీజీపీ సూచించారు. హాలీవుడ్ సినిమాలు కూడా హైదరాబాద్ లో షూటింగ్ జరిపేలా అభివృద్ధి చేద్దాం ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ కు ఐటీ, ఫార్మా రంగాలు ఎంత కీలకమో సినీ పరిశ్రమ కూడా అంతే కీలకంగా భావిస్తున్నట్టు సీఎం చెప్పారు. సామాజిక సేవ కార్యక్రమాల్లో సెలబ్రిటీలు పాల్గొనాలి అని చెప్పారు. అలాగే, గద్దర్ అవార్డుల కార్యక్రమం తో అనుసంధానంగా జరగాలి అని చెప్పారు. సీఎం గారు చిత్ర పరిశ్రమ భవిష్యత్తు కోసం తన సలహాలు, సూచనలను పంచుకున్నారు. సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. మేము ఆయనిచ్చిన సలహాలు,సూచనలపై దృష్టి పెడతాం. తదుపరి సమావేశంలో వివరణాత్మక ప్రతిపాదనను ఆయన ముందు ఉంచతాం" అని అన్నారు.

శుక్రవారం 27 –12–2024

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# దేశం ఓ విశిష్ట వ్యక్తిని కోల్పోయింది..
# రాష్ట్రపతి, ప్రధాని సహా ప్రముఖుల సంతాపం



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత మన్మోహన్ సింగ్ ( కన్నుమూశారు. గురువారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను దిల్లీలోని ఎయిమ్స్ అత్యవసరం విభాగంలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. దేశం గొప్పనేతను కోల్పోయిందని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**భరతమాత ముద్దు బిడ్డను కోల్పోయింది: రాష్ట్రపతి ముర్ము**
''విద్య, పరిపాలనను సమానంగా విస్తరింపజేసిన అరుదైన రాజకీయ నాయకుల్లో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఒకరు. భారత ఆర్థిక వ్యవస్థను సంస్కరించడంలో కీలకపాత్ర పోషించారు. దేశానికి ఆయన చేసిన సేవ, ఆయన రాజకీయం జీవితం, వినయంతో కూడిన నడవడిక ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆయన మృతి దేశానికి తీరనిలోటు. భరత మాత ముద్దుబిడ్డల్లో ఒకరైన మన్మోహన్‌కు మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు సానుభూతి తెలియజేస్తున్నా''

**దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చారు: ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్**
''మన్మోహన్ సింగ్ ఇక లేరన్న విషయం చాలా బాధకు గురిచేసింది. ఆయన భారత దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చారు. ఆర్థిక సరళీకరణ రూప శిల్పిగా పేరు గడించారు. ఎంతో ధైర్యం ప్రదర్శించి కఠిన నిర్ణయాలతో దేశం ముందుకు సాగేలా చేశారు. దేశ అభివృద్ధికి ఎన్నో ద్వారాలు తెరిచారు. ఉప రాష్ట్రపతిగా ఆయనతో ఎన్నో సంభాషణలు జరిపాను. ఆర్థిక విధానం పట్ల ఆయనకున్న ప్రగాఢ విశ్వాసం, దేశ పురోగతి పట్ల అచంచల నిబద్ధత ఎప్పటికీ గుర్తుండిపోతాయి. భారత దేశం మహోన్నతమైన వ్యక్తిని కోల్పోయింది. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.

**భారత్ విశిష్ట వ్యక్తిని కోల్పోయింది: ప్రధాని మోదీ**
''భారత దేశం విశిష్టమైన వ్యక్తుల్లో ఒకరైన మన్మోహన్ సింగ్‌ను కోల్పోయింది. ఎంతో నిరాడంబరంగా ఉండే ఆయన ఆర్థికవేత్తగా ఎదిగారు. ప్రధానిగానే కాకుండా ఆర్థిక మంత్రితో పాటు ఎన్నో ప్రభుత్వ విభాగాల్లో పనిచేశారు. దేశ ఆర్థిక విధానంపై ఎన్నో ఏళ్లుగా బలమైన ముద్రవేశారు. పార్లమెంట్‌లో ఆయన ప్రసంగాలు గొప్పగా ఉండేవి. ప్రధానిగా దేశ ప్రజల జీవితాలు మెరుగుపరిచేందుకు ఎంతో కృషి చేశారు. మన్మోహన్ ప్రధానిగా, నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తరుచూ మాట్లాడుకునేవాళ్లం. పాలనకు సంబంధించిన పలు అంశాలపై చర్చించేవాళ్లం. ఆయన జ్ఞానం, వినయం ఎల్లప్పుడూ ప్రస్ఫుటించేవి. ఈ సమయంలో నా ఆలోచనలన్నీ ఆయన కుటుంబం చుట్టూ తిరుగుతున్నాయి'' అని మోదీ పేర్కొన్నారు.

**దేశపాలనలో మన్మోహన్ సింగ్ పాత్ర కీలకం: అమిత్ షా**
''మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఇక లేరన్న వార్త చాలా బాధ కలిగించింది. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ నుంచి ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశ పాలనలో కీలక పాత్ర పోషించారు ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని భరించే శక్తిని ప్రసాదించాలని భగవంతుణ్ని వేడుకుంటున్నా''.

**మార్గదర్శిని కోల్పోయాను: రాహుల్ గాంధీ**
''గురువు, మార్గదర్శిని కోల్పోయాను. అపార జ్ఞానం, సమగ్రతతో మన్మోహన్ సింగ్ దేశాన్ని నడిపించారు. ఆర్థికశాస్త్రంలో ఆయన లోతైన అవగాహన దేశానికి స్ఫూర్తి. మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి'' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**నవభారత నిర్మాత మన్మోహన్‌సింగ్: సీఎం రేవంత్‌రెడ్డి**
మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ''మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థికవేత్త, రాజకీయ నాయకుడు, మానవతావాది. ఆయన తీసుకున్న అసామాన్య నిర్ణయాల్లో మానవతా దృక్పథం కూడా ఒకటి. మన్మోహన్‌సింగ్.. అసలైన నవభారత నిర్మాత. భరతమాత ఓ గొప్ప కుమారుడిని కోల్పోయింది''.

**భారత రాజకీయాల్లో తనదైన ముద్రవేశారు: జేపీ నడ్డా**
''మాజీ ప్రధాని, ఆర్థికవేత్త అయిన మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు. భారత రాజకీయాల్లో తనదైన ముద్రవేశారు. దూరదృష్టి గల రాజనీతిజ్ఞుడు. అణగారిన వర్గాల కోసం నిరంతరం తపించారు. పార్టీలకు అతీతంగా ఆయన నాయకత్వం గౌరవాన్ని పొందింది. ఆయన వారసత్వం దేశ నిర్మాణంలో భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి''.

**మన్మోహన్ చిరస్మరణీయులు: పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు**
''ఆర్థికవేత్తగా, రిజర్వు బ్యాంక్ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా దేశంలో ఎన్నో ఆర్థిక సంస్కరణలకు దిశానిర్దేశం చేసిన మన్మోహన్ సింగ్ చిరస్మరణీయులు. వ్యక్తిగతంగా నాకు ఎంతో ఆత్మీయులు. వారి నిబద్ధత, క్రమశిక్షణ, నిరాడంబరత ఆదర్శమైనవి. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి''.

**మన్మోహన్ ఆర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని తగ్గించాయి: ఖర్గే**
మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంతాపం తెలిపారు. ''దేశం దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడిని కోల్పోయింది. మన్మోహన్ ఆర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని తగ్గించాయి. మన్మోహన్‌ను దేశం ఎప్పుడూ కృతజ్ఞతతో గుర్తుపెట్టుకుంటుంది''

**ఉన్నత శిఖరాలకు చేరుకున్న భరతమాత ముద్దు బిడ్డ: కేసీఆర్**
మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మన్మోహన్‌సింగ్‌తో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు. ''ఆర్థిక సంస్కరణల అమలులో మన్మోహన్ సింగ్ తన విద్వత్తును ప్రదర్శించారు.
ఆయన ఉన్నత శిఖరాలకు చేరుకున్న భరతమాత ముద్దు బిడ్డ. మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగడం చారిత్రక సందర్భం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆయన మరణం దేశానికి తీరని లోటు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి'' అని కేసీఆర్ పేర్కొన్నారు.

**మన్మోహన్ నిజాయతీ మాకు ఎప్పటికీ స్ఫూర్తి: ప్రియాంక గాంధీ**
రాజకీయాల్లో కొంత మంది నేతలు మంది మాత్రమే స్ఫూర్తిగా నిలుస్తారు. వారిలో ఒకరు మన్మోహన్ సింగ్. ఆయన నిజాయతీ మాకు ఎప్పుడూ ఒక స్ఫూర్తిగా ఉంటుంది. ప్రతిపక్షాలు ఎప్పుడు విమర్శలు చేసినా నిబద్ధతతో దేశానికి సేవ చేశారు. ఆయన ఎంతో తెలివైన, ధైర్యసాహసాలు కలిగిన వ్యక్తి. కఠినమైన రాజకీయ ప్రపంచంలో ప్రత్యేక గౌరవప్రదమైన, సున్నిత వ్యక్తిగా చివరి వరకు కొనసాగారు.




# ప్రయోగాత్మక నిర్ణయం..
# మెరుగైన ఫలితం

**మొదటి పేజీ తరువాయి**
క్షేత్రస్థాయి అధ్యయనంతో వాస్తవానికి దగ్గరగా ఉన్న నిర్ణయాలు ప్రయోజనకరంగా ఉంటాయి. అలాంటి నిర్ణయమే ఇప్పుడు బోధన్ డిపోలో మెరుగైన ఫలితమిస్తోంది. ప్రయాణికుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని బోధన్ నుంచి నిజామాబాద్‌కు టూస్టాప్ సర్వీసు ఏర్పాటు చేశారు. దీనికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. నడిపించేది రెండు సర్వీసులే అయినా ప్రతి కి.మీకు అయ్యే ఖర్చు కంటే ఆదాయం ఎక్కువ వస్తోంది.

**రద్దీ ఎక్కువ..**
బోధన్‌నిజామాబాద్ మధ్య రద్దీ ఉంటుంది. ముఖ్యంగా విద్యా, ఉద్యోగం సహా ఇతర అవసరాలకు నిజామాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు అధికం. ఈ మార్గంలో ఎక్కువగా పల్లె వెలుగు సర్వీసులు ఉన్నాయి. ఇవి కాకుండా నిజామాబాద్‌కు తక్కువ స్టాపులతో ప్రయాణించే సర్వీసులంటే ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీలే ఆధారం. నేరుగా నిజామాబాద్ వెళ్లే వారికి పల్లెవెలుగులో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. దీంతో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిపించాలని పలువురు కోరారు. ప్రయాణికుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని నెలన్నర కిందట బోధన్ నిజామాబాద్ టూస్టాప్ బస్సు ప్రారంభించారు. మధ్యలో ఎడపల్లి, జానకంపేట్ స్టాప్‌లు ఇచ్చారు. ప్రధానంగా ఉద్యోగులకు అనువుగా ఉండే సమయాల్లో ఈ సర్వీసులు ఉండేలా చూశారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 7 గంటల మధ్య ఇవి నడుస్తాయి. అందుకు రెండు బస్సులను పది ట్రిప్పులు నడిచేలా షెడ్యూలు చేశారు. వీటికి అదనంగా మరో ఎక్స్‌ప్రెస్‌తో నాలుగు ట్రిప్పులు నడిపిస్తున్నారు. మొత్తం 14 ట్రిప్పులతో సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి 3045 నిమిషాలకు ఒక సర్వీసు అందుబాటులో ఉండేలా చేశారు. ప్రయాణికులు గమ్యస్థానం చేరేందుకు పల్లెవెలుగులో గంట పడుతుంది. ఈ కొత్త సర్వీసుతో 45 నిమిషాల్లోనే చేరుకుంటున్నారు. మహాలక్ష్మి పథకం వర్తింపజేస్తూ నడుస్తున్న ప్రతి సర్వీసుకు ఓఆర్ 116118 వరకు వస్తోంది. ఇక బోధన్ డిపోలోని బస్సులు ప్రతి కి.మీ ప్రయాణించేందుకు రూ.45ఖర్చు చేస్తుంటే.. ఈ రెండు సర్వీసులకే రూ.7677ల ఆదాయం వస్తోంది. పల్లె వెలుగుకు రూ.65 ఆదాయం సమకూరుతోంది. ఒక్క బస్సు రోజుకు 320కి.మీ తిరిగి రూ.25వేల ఆదాయం ఆర్జిస్తున్నట్లు చెబుతున్నారు.




# సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదనకు
# సీడబ్ల్యూసీ ఆమోదం

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
కర్ణాటకలోని బెలగావిలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశానికి తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. జనగణనలో కులగణన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రతిపాదనకు సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.
ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు. ''దేశంలో త్వరలో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశాలు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన జరిగితే దక్షిణాది రాష్ట్రాలలో సీట్ల పెంపు తక్కువగా ఉండి నష్టపోయే పరిస్థితి ఉంటుంది. దీనిపై ఏఐసీసీ వ్యూహాత్మకంగా ఆలోచించాలి. నియోజకవర్గాల సంఖ్య పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా అత్యంత జాగ్రత్తగా ముందడుగు వేయాలి. చట్ట సభల్లో మహిళా బిల్లును కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే ప్రవేశ పెట్టి ఒక కొలిక్కి తెచ్చాం. ఈ నేపథ్యంలో ఆ బిల్లుపై మనం ఎక్కువగా ప్రచారం చేయాలి.భాజపా.. మహిళా బిల్లుతో వారికి అనుకూలంగా రిజర్వేషన్లు చేసుకునే అవకాశాలు ఉంటాయి. ఆ విషయంలో కాంగ్రెస్ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. తెలంగాణలో కులగణన దేశంలోనే మార్గదర్శిగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది చేయబోతున్న జనగణనలో దేశ వ్యాప్తంగా కులగణన కూడా చేపట్టాలని కాంగ్రెస్ డిమాండ్ చేసి పోరాటం చేయాలి. ఈ విషయంలో సీడబ్ల్యూసీ ఒక తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు

# ఏకంగా పోలీసులపైనే
# దౌర్జన్యం, బెదిరింపులు..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
బీఆర్ఎస్ నేతల అరెస్ట్ కు పోలీసులు సిద్ధం..
పోలీసు అధికారులపై దురుసు ప్రవర్తన, విధులకు ఆటకం కలిగించారంటూ పోలీసుల కేసులో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. కాగా.. ఇదే కేసులో బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ను పోలీసులు అదుపులోకి తీసుకుని, మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో పోలీస్ స్టేషన్ దగ్గరకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు చేరుకుని ఆందోళనలు చేస్తున్నారు.
ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇంజిలిజెన్స్ విభాగం ఐడీ శివధర్ రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పెద్ద గొడవ చేశారు. వారిపై పోలీసులు కేసు నమోదు చేయాలని ఆందోళన చేపట్టారు. తన పార్టీ అనుచరులతో కలిసి ఈ నెల 4న బంజారాహిల్స్ పోలీసు ఠాణా వద్దకు వచ్చారు. ఆ సమయంలో పెద్ద ఎత్తున నినాదులు చేసుకుంటూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు.
కౌశిక్ రెడ్డి, అతని అనుచరులు వచ్చిన సమయంలోనే తెలంగాణ సీఎం పర్యటన ఉండడంతో ముఖ్యమైన పనుల నిమిత్తం ఇన్ స్పెక్టర్ కే.ఎం. రాఘవేంద్ర బయటకు వెళుతున్నారు. పోలీసు స్టేషన్ ముందు బైటాయించిన కౌశిక్ రెడ్డి.. ఇన్ స్పెక్టర్ వాహనాన్ని అడ్డుకోవడంతో పాటు రాఘవేంద్ర పై గోడవకు దిగారు. అడ్డుకునేందుకు ప్రయత్నించి పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. దీంతో.. ఆగ్రహించిన పోలీసులు కౌశిక్ రెడ్డిని, అతని అనుచరుల్ని అక్కడి నుంచి పంపించేశారు. వాళ్లపై పోలీసు అధికారుల విధులకు ఆటంకం కలిగించడం, దురుసుగా ప్రవర్తించడం సహా బెదిరింపులకు దిగారనే కేసులు నమోదు చేశారు. బంజారా హిల్స్ ఇన్ స్పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు బంజారాబిల్స్ ఠాణాలో కౌశిక్ రెడ్డితో పాటు ఆయన అనుచరులు 25 మందిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసులో మాసబ్ ట్యాంక్ ఇన్ స్పెక్టర్ పరశురాం విచారణ అధికారిగా ఉన్నారు. కాగా కేసులోని నిందుతులకు తాజాగా విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు జారీ చేశారు. వారిలో.. తెలంగాణ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ కూడా ఉన్నారు.పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన కేసులో విచారణ నోటీసులు అందించేందుకు ఎర్రోళ్ల శ్రీనివాస్ నోటీసులు ఇవ్వడానికి మారేడ్ పల్లిలోని ఇంటికి వెళ్లిన బంజారా హిల్స్ పోలీసులు వెళ్లగా.. ఇంట్లో నుంచి బయటికి రాలేదని తెలిపారు. అదే సమయంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఇంటికి తరలివచ్చి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో.. ఎర్రోళ్ల శ్రీనివాస్ ను మాసబ్ ట్యాంక్ పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.




ఇదే సమయంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి బంజారాహిల్స్ డివిజన్ పోలీసులు బుధవారం నోటీలుసు అందజేశారు. ఈనెల 27న వ్యక్తిగతంగా పోలీసు విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. తొలుత కౌశిక్ రెడ్డికి వాట్సప్ ద్వారా మంగళవారం రాత్రి పోలీసులు నోటీసులు పంపారు. ఆయన స్పందించక పోవడంతో బుధవారం ఉదయం పోలీసు సిబ్బంది నేరుగా వెళ్లి కౌశిక్ రెడ్డికి నోటీసులు అందజేశారు.
కాగా.. వ్యక్తిగత పనుల కారణంగా ఈ నెల 27న హాజరు కాలేనని పోలీసులకు కౌశిక్ రెడ్డి తెలిపారు. మరోరోజు విచారణకు హాజరవుతానని చెప్పగా.. ఇదే విషయాన్ని లిఖితపూర్వకంగా అందిస్తే పరిశీలిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.



# పడిపోయిన విద్యుత్తు డిమాండ్

**కామారెడ్డి ,తెలంగాణ ముచ్చట్లు:**
జిల్లాలో విద్యుత్తు డిమాండ్ నవంబరు నుంచి తగ్గుతూ వస్తోంది. డిస్కంలు కేటాయించిన కోటా కంటే తక్కువ విద్యుత్తును వినియోగించుకుంటున్నాం. వ్యవసాయ బోరు మోటార్లు విరామంలో ఉండడం, చలి పెరగడంతో ఒక్కసారిగా విద్యుత్తు అవసరాలు తగ్గుముఖం పట్టాయి. విద్యుత్తు సంస్థలు డిసెంబరు నెలకు జిల్లాకు నిత్యం 4.12 మిలియన్ యూనిట్లు కేటాయించాయి. ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో నిత్యం 3 మిలియన్ యూనిట్లకు కొంచెం అటుఇటుగా వాడుతున్నాం. మరో 15 రోజుల వరకు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉంది.

**వరి నాట్లు జోరందుకోగానే..**
జిల్లాలో వ్యవసాయం ప్రధానంగా భూగర్భజలాలపై ఆధారపడి చేస్తారు. ప్రాజెక్టులు లేక అత్యధికశాతం మంది రైతులు బోరుబావులపైనే ఆధారపడతారు. జిల్లాలో అధికారికంగా 1.10 లక్షల బోరుబావులకు విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ఇవి ప్రస్తుతం విరామదశలో ఉన్నాయి. వానాకాలం వరి కోతలు పూర్తికాగానే రైతులు బోరుబావులను ఆపివేశారు. జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్లలో రైతులు వరిపంటనే ప్రధానంగా సాగు చేస్తారు. రానున్న యాసంగిలో 2.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయడానికి అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. మరో 15 రోజుల నుంచి నాట్లు జోరందుకుంటాయి. అప్పటినుంచి విద్యుత్తు డిమాండ్ మళ్లీ పెరుగుతుంది. జనవరి నెలాఖరు వరకు జిల్లాలో నాట్లు వేసుకుంటారు. ఏప్రిల్ మాసం వరకు విద్యుత్తుకు అధిక డిమాండ్ ఉంటుంది. అదే సమయంలో ఎండల తీవ్రత పెరగడంతో గృహ వినియోగదారులు కూడా అధికంగా వినియోగిస్తారు.

# ప్రజల హక్కుల కోసం
# నిరంతర పోరాటం

**సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి**

మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాల పునాదులపై సీపీఐ ఆవిర్భవించిందని సీపీఐ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. పార్టీ 100వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ ప్రజల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటాలు చేస్తోందని చెప్పారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు ఇంకా అమలు కావడం లేదని తెలిపారు. భూములు, కార్మికుల హక్కులు సీపీఐ పోరాటం వల్లే వచ్చాయని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికే ప్రమాదం వచ్చిపడిందని విమర్శించారు.
మహిళలు, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయి: అజీజ్ పాషాదేశవ్యాప్తంగా కమ్యూనిస్టులు పండగ చేసుకుంటున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా అన్నారు. కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించి నేటికీ వందేళ్లు అవుతోందని చెప్పారు. భారతదేశ చరిత్రలో కమ్యూనిస్టు పార్టీది ప్రముఖ పాత్ర అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించినట్లు వివరించారు. రాజ్యసభ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ భాజపా కార్యకర్తల్లా తయారయ్యారని విమర్శించారు. దేశంలో మహిళలు, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయని మండిపడ్డారు. ఏడాది పాటు పార్టీ శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తామని.. ముగింపు కార్యక్రమాన్ని ఖమ్మంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు



# ఎమర్జెన్సీ విద్యుత్..
# 28న గ్రిడ్ ఇండియా మాక్ ఎక్సర్‌సైజ్

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
దక్షిణాది రాష్ట్రాల్లో గ్రిడ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 28న మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నారు. పవర్ సప్లయ్ పూర్తిగా ఫెయిలైన సందర్భాల్లో విద్యుత్ పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై ఉద్యోగులు, సిబ్బందికి మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా అవగాహన కల్పించనున్నారు. అలాగే సిబ్బంది ఎంతమేరకు అలర్ట్ గా ఉన్నారనే అంశాలను పరిశీలించనున్నారు. ఈనెల 28న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ మాక్ ఎక్సర్‌సైజ్ జరగనున్నట్లు ట్రాన్స్ కో సీఎండీ కృష్ణభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. ఈ మాక్ ఎక్సర్‌సైజ్ ప్రతి ఏడాది నిర్వహించే కార్యక్రమమేనని పేర్కొన్నారు.
ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్ పేర్కొన్నారు. ప్రధానంగా కౌటాల, మెట్‌పల్లి, మేడిపల్లి, కథలాపూర్, రాయికల్, జగిత్యాల రూరల్, కొడిమ్యాల, మల్యాల్, వేములవాడ రూరల్, గంగాధర, రామడుగు, చొప్పదండి, నందగిరి ఫీడర్లలో 30 నిమిషాల పాటు సరఫరాకు అంతరాయం కలిగే అవకాశముందన్నారు. విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరించాలని, వారికి కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని సీఎండీ తెలిపారు.

# 'డైట్'కు నూతన సొబగులు

**ఖమ్మం,తెలంగాణ ముచ్చట్లు:**
ఖమ్మంలోని జిల్లా విద్యా, శిక్షణ(డైట్) కళాశాలకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలోని రెండింటికి సెంటర్ హోదా లభించగా ఇందులో ఖమ్మంలోని డైట్ కళాశాల ఒకటి. రూ.8.62కోట్లతో అభివృద్ధి పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించనున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాల విద్యార్థులు ఇక్కడ ఉపాధ్యాయ వృత్తిలో శిక్షణ తీసుకుంటారు.

**రానున్న కొత్త కోర్సులు**
ప్రస్తుతం ఈ కళాశాలలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సును మాత్రమే నిర్వహిస్తుండగా ఇక నుంచి డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కోర్సు రానుంది. దీని ఆధారంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, ఎల్‌కేజీ పిల్లలకు బోధించేందుకు అవసరమైన శిక్షణను టీచర్లకు ఇస్తారు. వీరితో పాటు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు బోధించే ఉపాధ్యాయులకూ తర్ఫీదు అందనుంది.

**1990-–91లో ప్రారంభమై..**
జిల్లా స్థాయిలో విద్యా, శిక్షణ కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు ఖమ్మం నగరంలోని టేకులపల్లిలో జిల్లా విద్యా, శిక్షణ సంస్థ (డైట్)ను 199091లో ఏర్పాటు చేశారు. అప్పట్లో తొలిసారిగా టీటీసీ కోర్సు ప్రవేశపెట్టారు. ఏడాది కోర్సులో 150 సీట్లు ఉండేవి. ఉపాధ్యాయ శిక్షణకు ప్రాధాన్యమిచ్చి నాణ్యమైన విద్యావ్యవస్థ స్థాపనకు ఈ సంస్థ దోహదపడింది. 1991లో కొత్త భవనాలు సమకూరాయి. ఇవి ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధి, విద్యాశిక్షణ, పరిశోధనలు, ఆవిష్కరణలకు ఉపయోగపడుతున్నాయి. 2000 సంవత్సరంలో డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఈడీ) కోర్సు మొదలైంది. దీని వ్యవధి రెండేళ్లు. మొదటి సంవత్సరంలో 100 సీట్లు, రెండో సంవత్సరంలో 100 సీట్లతో భావి ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు.




**డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో శిక్షణ..**
అనంతరం జరిగిన మార్పుల్లో 201415 విద్యాసంవత్సరంలో డీఈడీ కోర్సు డీఈఎల్‌ఎడ్(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) కోర్సుగా మారింది. ఈ కోర్సులో మొదటి సంవత్సరంలో 100, రెండో సంవత్సరంలో 100 సీట్లున్నాయి. వీటిలో 50 సీట్లు ఆంగ్లమాధ్యమం, 50 సీట్లు తెలుగు మాధ్యమానికి కేటాయించారు. ఈ భవనాలు విద్యాశిక్షణలో వృత్తి పూర్వ, వృత్యంతర శిక్షణ కార్యక్రమాలను నిర్వహించే ముఖ్యకేంద్రంగా మారాయి.



## అశ్వారావుపేట నియోజకవర్గంలో అమాత్యుల విస్తృత పర్యటన

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**

రాష్ట్ర రెవిన్యూ గృహనిర్మాణం సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు స్థానిక ఎమ్మెల్యేజారె ఆదినారాయణ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి దమ్మపేట మండలం నాచారం, గున్నేపల్లి గ్రామపంచాయతీలకు 40 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాలను ప్రారంభించారు దమ్మపేట ఎంపీడీవో కార్యాలయంలో త్వరలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మించబోయే ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన మోడల్ హౌస్ నిర్మాణ పనులను ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4 లక్షల 50 వేల ఇండ్లు ఈ సంక్రాంతి నుంచి ప్రారంభించి పేద ప్రజలకు కానుకగా ఇస్తామన్నారు అందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయించామని స్థానిక ఎమ్మెల్యేజారె ఆదినారాయణ అభ్యర్థన మేరకు ఈ గిరిజన నియోజకవర్గానికి అదనంగా మరికొన్ని ఇందిరమ్మ ఇండ్లు కేటాయించటానికి ఆలోచన చేస్తున్నామన్నారు అదనంగా ఇండ్లు కేటాయించే విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుని తప్పకుండా ఎమ్మెల్యే అభ్యర్థనకు అనుగుణంగా ఇండ్లు కేటాయించి ఏజెన్సీ ప్రాంతానికి లబ్ధిచేకూరుస్తామన్నారు .

అలాగే ఈ ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పేద ప్రజలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ పథకాలు అందించే విషయంలో పార్టీలు వర్గాలు రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క పేదవాడికి న్యాయం చేస్తామన్నారు.

దమ్మపేట ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన మంత్రి పొంగులేటి పర్యటనలో భాగంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దమ్మపేట ఎమ్మార్వో కార్యాలయాన్ని సందర్శించారు ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి ఆ రికార్డుల్లో పొందుపరిచిన అంశాలకు సంబంధించిన సమాచారం ఇంచార్జ్ ఎమ్మార్వో ని అడిగి తెలుసుకున్నారు ఆ రికార్డుల ఆధారంగా బాధితులకు ఫోన్ చేసి కార్యాలయంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు.అశ్వారావుపేట మండలం కేశప్పగూడెం, ములకలపల్లి మండలం కొత్తూరు గ్రామాలలో నిర్మించబోయే హై లెవెల్ వంతెనల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ శ్రేణులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు



## మంత్రి సీతక్కకు సమగ్ర శిక్ష ఉద్యోగుల వినతి

**వేలేరు,తెలంగాణ ముచ్చట్లు:**

తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ తరపున మంత్రి సీతక్కకు మండల కేంద్రం వేలేరు వద్ద వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు మాట్లాడుతూ తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించడం కష్టమవుతుందని, పిల్లలకు ఉన్నత విద్య అందించలేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వారి పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ రాజ్ కుమార్, మేఘమాల, జోష్ణ, రోజా తదితర ఉద్యోగులు పాల్గొన్నారు. కాంప్లెక్స్ స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది, కేజీబీవీ సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మీ ఇంటి వాచీలో నా బొమ్మ ఉంది గుర్తు పట్టారా...?

- నేను మీ పొంగులేటి శీనన్నను
- అశ్వారావుపేట నియోజకవర్గ పర్యటనలో మహిళా కూలీలతో ముచ్చట
- సంక్రాంతి నాటికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని హామీ

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

ఏం అక్కాచెల్లమ్మలు బాగున్నారా... సొంత ఇళ్లు న్నాయా మీకు....ఇంతకీ నేనెవరో తెలుసా...? మీ ఇంటి వాచీలో నా బొమ్మ ఉంది గుర్తు పట్టారా...? అంటూ మహిళా కూలీలతో తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కాసేపు సరదాగా ముచ్చటించారు. అశ్వారావుపేట నియోజక వర్గ పర్యటనకు గురువారం వచ్చిన ఆయన అశ్వారావుపేట మండలంలో తన పర్యటనను ముగించుకుని ములకలపల్లి వెళ్తూ మార్గమధ్యలో శనగకాయలు శుభ్రపరుస్తున్న మహిళా కూలీలను చూసి ఆగారు. వారితో పై విధంగా కాసేపు సరదాగా సంభాషించారు.... చేతికి గాజులు వేయించుకోమని చెప్పి కొంత నగదును అందించారు. అదేవిధంగా కొద్ది దూరం వెళ్ళాక మరొక ప్రాంతంలో ఆగి అక్కడ ఉన్న మహిళలతో మాట్లాడి సంక్రాంతి నాటికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని నచ్చినట్టు కట్టుకోమని హామీ ఇచ్చారు.

# స్నేహ చికెన్ పరిశ్రమ దుర్మార్గాలపై విచారణ జరపాలి

### స్థానికులకు ఉపాధి కరువు... ఒకే కులం వారికి చేయూత

- బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ...భూ కబ్జాలు, జల దోపిడీతో దౌర్జన్యం చేస్తూ... వాయు కాలుష్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న స్నేహ చికెన్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు.గురువారం పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో స్థానిక రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ మహబూబ్ నగర్, వనపర్తి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో కొన్నేళ్ల క్రితమే స్నేహ చికెన్ ఫౌల్ట్రీ పరిశ్రమను స్థాపించారని,చిన్నగా ప్రారంభమైన ఈ కంపెనీ ఇప్పుడు తన పరిధిని విస్తృతం చేసుకున్నదన్నారు.పెద్దమందడి మండలం వెల్టూరు శివారులోని 22/1 లో ప్రభుత్వ భూమిని స్నేహ చికెన్ పరిశ్రమ ఆక్రమించి, అక్కడ కొన్ని నిర్మాణాలు కూడా చేపట్టిందని ఫిర్యాదు చేస్తే అధికారులు సర్వే నిర్వహించి.. రికార్డులు పరిశీలించిన తర్వాత వెల్టూరు శివారులోని సర్వే నెంబర్ 22/1లో 1.25 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని నిర్ధారించి, ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను ఎందుకు తొలగించకూడదో.. వివరణ ఇవ్వాలని స్నేహ చికెన్ కంపెనీ ఎండీ రాంరెడ్డికి ఫిబ్రవరి 28, 2024 న నోటీసులు జారీ చేశారన్నారు.నోటీసులు జారీ చేసి 10 నెలలు గడుస్తున్నా వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలన్నారు.స్నేహ చికెన్ కంపెనీ భీమా రెండో దశలో అంతర్భాగంగా నిర్మించిన శంకర్ సముద్రం రిజర్వాయర్ నుంచి రోజుకు 10 లక్షల లీటర్ల చొప్పున కంపెనీ, అలాగే అందులో ఉండే క్వార్టర్స్ గృహ అవసరాలకు తరలించుకునేందుకు అనుమతి తీసుకున్నదని, ఈ నీటి తరలింపు సంవత్సరంలో 0.01289 టీఎంసీలను మించకూడదనే నిబంధన ఉన్నప్పటికి స్నేహ కంపెనీ దౌర్జన్యంగా అధికంగా నీటిని తరలిస్తోందని ఆరోపించారు.తాగునీటికి నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకోకుండా ప్రభుత్వ నిభందనలు తుంగలో తొక్కి డెడ్ స్టోరేజీలో కూడా దౌర్జన్యంగా పరిశ్రమకు తీసుకెళ్లారని మండిపడ్డారు.

**పర్యావణానికి తూట్లు**

అధికారుల అండదండలు...ప్రజాప్రతినిధుల అభయ హస్తంతో స్నేహ ఫార్మ్స్ యాజమాన్యం రెచ్చిపోతుందని, పర్యావరణ నిబంధనలకు తూట్లు పొడుస్తూ...స్నేహ ఫార్మ్స్ నుంచి వచ్చే వ్యర్ధ పదార్థాలు పొలాలలో వదలడంతో అవి పెద్దమునగల్ చేడు వాగులో కలిసి కలుషితమై సరళసాగర్ మీదుగా రామన్‌పాడు డ్యామ్‌లోకి వెళ్తున్నాయన్నారు.రామన్‌పాడు డ్యామ్ నుంచి సరఫరా అయ్యే కలుషితమైన నీరు తాగి పలువురు క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడుతున్నారన్నారు.పెద్దమునగల్ చేడ్, బలీదుపల్లి శివారు మధ్యలో జహంగీర్ పీర్ దర్గా దగ్గర జాతీయ పక్షి నెమలులు, రాష్ట్ర జంతువైన జింకలు ఎక్కువగా ఉంటాయని,ఈ కలుషిత నీరు త్రాగి వీటితో పాటు పశువులు, గొర్రెలు కూడా చనిపోతున్నాయన్నారు. కావున ప్రభుత్వ నిభందనలకు తూట్లు పొడుస్తూ... ప్రజల జీవితాలలో చెలగాటమాడుతున్న స్నేహ కంపెనీని మూసివేయాలన్నారు.పరిశ్రమ స్థాపన కొసం అన్ని వర్గాల రైతులతో భూములు తీసుకొన్న యాజమాన్యం, తమ పరిశ్రమ నుంచి వచ్చే చికెన్ ను అందరికీ అమ్ముకుంటున్న యాజమాన్యం ఉపాధి అవకాశాలు కల్పించే విషయంలో మాత్రం ఒకే కులం వారికి మంచి ఉద్యోగాలు కల్పిస్తూ...పేద వర్గాలను విస్మరిస్తూ అరకొర అవకాశాలు కల్పిస్తున్నారని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి నాయకులు రమేష్ సాగర్, చాకలి రమేష్, అంజన్న యాదవ్,మహేందర్ నాయుడు, మ్యాదరి రాజు, దేవర శివ, కుర్వ నరసింహ, శాఖ కొండన్న, గండి చంద్రయ్య, మూలమల్ల రాములు, రాజేష్, బోయ వినయ్, బోయ దాసు, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ అవకాశం కల్పిస్తే వెల్టూర్ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉంటా

- గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా
- దయ్యాల శేఖర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



రానున్న సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పిస్తే పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకులు దయ్యాల శేఖర్ అన్నారు. సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే సర్పంచ్ అభ్యర్థులు ఎవరికివారు తమ అస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగానే వెల్టూరు గ్రామానికి చెందిన యువ నాయకుడు దయ్యాల శేఖర్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయాలని ఆసక్తిగా ఉన్నారు. ముఖ్యంగా రిజర్వేషన్లు కీలకంగా మారినట్టు తెలుస్తుంది. గురువారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ .. ఈసారి తప్పకుండా ప్రజా ప్రభుత్వంలో వెల్టూరు గ్రామానికి సర్పంచ్ గా ఎస్సీ రిజర్వేషన్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్సీ రిజర్వేషన్ వస్తే తప్పకుండా సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తానని దయ్యాల శేఖర్ అంటున్నారు. సర్పంచిగా గ్రామ ప్రజలు అవకాశం కల్పిస్తే .. ఎమ్మెల్యే మెగా రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు. హంగు ఆర్భాటాలు లేకుండా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ గ్రామంలోని ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం కల్పించాలని గ్రామ ప్రజలను కోరుతున్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో గ్రామ ప్రజల నాడిని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎంతోమంది ఆశావాహులు ఉన్నప్పటికీ తనదైన శైలిలో ముందుకు దూసుకెళ్లే ప్రయత్నం చేస్తూ... ప్రజలకు ఏలాంటి నాయకుడు కావాలో తెరచాటన ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఆశావాహులు ఎంతమంది ఉన్నా తనదైన శైలిలో గ్రామానికి ఏమి కావాలో,గ్రామాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయాలో... అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించడానికి సన్నద్ధమవుతున్నట్టు తెలుస్తుంది. ముఖ్యంగా ఎమ్మెల్యే మెగా రెడ్డి ఆధ్వర్యంలో వెల్టూరు గ్రామాన్ని మండల కేంద్రం, సంత బజార్ , బ్యాంకు, జూనియర్ కళాశాల వంటి ఈ ప్రధాన అంశాల పైన దృష్టి పెట్టి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలకు వీటిని ఏర్పాటు చేయడం ద్వారా గ్రామంలోని యువతకు, గ్రామ ప్రజలకు ఉపాధి కలుగుతుందని, గ్రామానికి రెవెన్యూ వచ్చేందుకు అవకాశం ఉంటుందని, పరిపాలనకు సౌలభ్యంగా ఉంటుందని భావిస్తున్నాను అని అంటున్నారు. కనుక వీటి మీదనే ఎక్కువ దృష్టి సారించి ప్రజలకు నెరవేర్చేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రజా క్షేత్రంలోకి విస్తృతంగా వెళ్లి తమ అభ్యర్థిత్వనికి మద్దతు కోరే అవకాశం కనిపిస్తుంది. తన మన అనే భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి ముందు కెళ్లాలని ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తుంది. సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తా సర్పంచ్ గా అవకాశం కల్పించండి, సహకరించండి. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని దయ్యాల శేఖర్ కోరుతున్నారు.



## మావోయిస్టు ఇలాఖాలో సిఆర్పిఎఫ్ 212 అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- అమిత్ షా పిలుపుతో ఆదివాసీలకు దగ్గరైన సిఆర్పిఎఫ్ 212 బెటాలియన్
- మావోయిస్టుల అణచివేతే కాదు ఆదివాసీల ఆరోగ్యమూ ముఖ్యమే

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇచ్చిన పిలుపుతో సిఆర్పిఎఫ్ 212 బెటాలియన్, కోబ్రా భద్రతా బలగాలు ఆదివాసీల అభివృద్ధి, ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మావోయిస్టు ఇలాకాగా చెప్పబడే కిష్టారం, గొల్లపల్లి ప్రాంతంలో పొటక్ పల్లి, డబ్బమార్క సిఆర్పిఎఫ్ 212(ఎఫ్ఓబి) క్యాంపుల ద్వారా కమాండెంట్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ్ అద్వర్యంలో గిరిజనుల ఆరోగ్య, విద్య, వైద్య, పరిస్థితులను మెరుగు పర్చడమే కాకుండా మావోయిస్టులను అణచివేతలోనూ ముందున్నారని మెచ్చుకుని కితాబిచ్చారు కేంద్ర హోంమంత్రి అమిత్ షా. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన చత్తీస్గడ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో అత్యంత మావోయిస్టు ప్రాబల్య ప్రాంతమైన డబ్బమార్క, పొటక్పల్లి, ఆమ్మెపెంద, తెల్మడుగు, వెర్మమోడ్, వీరాపూర్ తదితర గ్రామాల ఆదివాసీలకు ఆరోగ్య పరిస్థితులను పరీక్షించెందుకు సిఆర్పిఎఫ్ 212 బెటాలియన్ అధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా ఆదివాసీ గ్రామాల్లో జబ్బు బారిన పడి ఆకస్మాత్తుగా మృత్యువాత పడుతుండడంతో వారి మరణాలు తగ్గించేందుకు సిఆర్పిఎఫ్ ప్రత్యేక చొరవ చూపి అట్టి ఆదివాసి ప్రజలకు బ్లడ్ నమూనలను సేకరించి కావాల్సిన వైద్యం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ఆదివాసి గిరిజనులకు బ్లడ్ షుగర్, టోటల్ కొలస్ట్రాల్, హెచ్ డి ఐ, ఎల్డీఎల్, ఎస్జివోటీ, ఎస్జిపిటీ, యూరిక్ యాసిడ్ హెమోగ్లోబిన్, న్యూట్రోఫిల్స్ లింకోసైటిస్, ప్లేట్లెట్ కౌంట్ వంటి తదితర టెస్టులకు గాను ఆదివాసీల నుండి రక్త నమూనాలను సేకరించి వారి ఆరోగ్య స్థితి గతులను కనుగొని ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



## ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 రాష్ట్రస్థాయి పోటీలకు రంగం సిద్ధం

- జిల్లా నుండి 365 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపిక. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.
- సీఎం కప్ 2024 రాష్ట్రస్థాయి పోటీలకు సర్వం సిద్ధం
- డిసెంబర్ 27 నుండి జనవరి 2 వరకు జరగనున్న పోటీలు.
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.

**మెదక్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26: తెలంగాణ ముచ్చట్లు:**



రాష్ట్రస్థాయి క్రీడా పోటీలపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 రాష్ట్రస్థాయి పోటీలకు రంగం సిద్ధమవుతోంది అని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మొట్ట మొదటి సారిగా గ్రామీణ స్థాయి నుండి నిర్వహిస్తున్న ఈ పోటీలు గ్రామస్థాయి, మండల స్థాయి జిల్లా స్థాయి పోటీలు పూర్తిచేసుకుని డిసెంబర్ 27 నుండి జనవరి 2 వరకు రాష్ట్రస్థాయి పోటీలు ఒక పండుగ వాతావరణం లో నిర్వహించుకోబోతున్నందుకు శుభ పరిణామంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి సీఎం కప్ 2024 పోటీలలో భాగంగా మెదక్ నుండి యువతి యువకుల కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్బాల్, ఫుట్బాల్ టేబుల్ టెన్నిస్ మరియు అత్యత్య క్రీడాకారులు గురువారం రాష్ట్రస్థాయి క్రీడలలో పాల్గొనడానికి పంపించడం జరిగిందని అన్నారు. వీరందరూ మహబూబ్ నగర్ హైదరాబాద్ రంగా రెడ్డి జిల్లాలలో జరిగే రాష్ట్ర పోటీలలో పాల్గొంటారని చెప్పారు. ఇప్పటికే ఆర్చరీ, అథ్లెటిక్స, ఆత్యాపాత్య, బ్యాడ్మింటన్, బాస్కెట్బాల్, చెస్, సైక్లింగ్, ఫుట్బాల్, కబడ్డీ, హ్యాండ్ బాల్, కరాటే, ఖోఖో, కిక్ బాక్సింగ్, ఉషు, బాక్సింగ్, సేపక్ తక్ర, సాఫ్ట్ బాల్, యోగ టేబుల్ టెన్నిస్ క్రీడలలో బాలబాలికలకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి ఎంపిక చేయడం జరిగిందన్నారు. అన్ని క్రీడలలో కలిపి మొత్తం 199 మంది బాలికలు 168 మంది బాలురు మొత్తం 367 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయికి పంపడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈరోజు జిల్లా నుండి కబడ్డీ క్రీడాకారులు 12 మంది బాలురు 12 మంది బాలికలు మొత్తం 24 మంది క్రీడాకారులతో కూడిన జిల్లా జట్టు తో పాటు 2 టీం మేనేజర్ మరియు కోచ్లు ఉన్నారని తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వివరించారు.తెలంగాణ గ్రామీణ క్రీడా రంగాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నామన్నారు.మట్టిలో మాణిక్యాలను గుర్తించి వారి ప్రతిభకు ప్రోత్సాహం కల్పించాలన్న ఆశయంతో పనిచేస్తున్నామన్నారు పల్లెల నుంచి ప్రపంచ ఛాంపియన్లను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పగడ్బందీగా ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రస్థాయిలో పాల్గొంటున్న దాదాపు రెండు లక్షల మంది కి పైగా క్రీడాకారుల సమాచారాన్ని గేమ్స్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా సంక్షిప్తం చేయడం, క్రీడాకారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలు అందజేయడం క్రీడలకు ఆధునిక సాంకేతిక హంగులు సమకూర్చడం రాబోయే తరానికి దిక్సూచిలా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తోంది. అని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ క్రీడల్లో పాల్గొని క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయన్నారు.

**వివక్షతకు తావు లేకుండా**

పారా క్రీడాంశాలో పోటీలు నిర్వహించుకోవడం ఈ సీఎం కపోటీలో మరో ప్రత్యేకత అన్నారు.ఒక యజ్ఞం లాగా నిర్వహిస్తున్న ఈ సీఎం కప్ 2024 విజయవంతం చేయడంలో యావత్తు తెలంగాణ క్రీడా సంఘాలు, పీఈటీలు ఫిజికల్ డైరెక్టర్లు స్వచ్ఛంద సంస్థలు పలువురు క్రీడాభిమానులు పాలుపంచుకుంటున్నందుకు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు :**

హనుమకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలు శుక్రవారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభం కానున్నాయి.రాష్ట్రస్థాయి పోటీలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభిస్తారు.వివిధ క్రీడాంశాలలో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయగా శుక్రవారం ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, తదితరుల చేతుల మీదుగా ప్రారంభం కానున్నాయి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఖమ్మం నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలి

- సిపిఎం ఖమ్మం రాష్ట్ర నాయకులు యర్రా. శ్రీకాంత్ డిమాండ్.

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**




ఖమ్మం నగర అభివృద్ధికి నిధులు కేటాయించాలి. అని సిపిఎం రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కమిటీ సమావేశం సిపిఎం ఖమ్మం డివిజన్ నాయకులు ఎల్లంపల్లి వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీకాంత్ మాట్లాడుతూ ఖమ్మం మున్నేరు పై తీగల వంతెన మున్నేరుకి ఇరువైపులా కరకట్ట కట్టాలి . మున్నేరు కరకట్ట పనులు తొందరగా పూర్తయ్యేటట్లు మంత్రులు అధికారులు మరల వర్షాకాలం వచ్చేసరికి మళ్లీ వరదప్రాహేమునకు గురికాకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి.శివారు ప్రాంతాలలో రోడ్లు డ్రైన్లు విద్యుత్ సౌకర్యం కల్పించాలి . నగరం విస్తరిస్తుంది. రహదారులు పి ఎస్ ఆర్ రోడ్ బస్ డిపో రోడ్ కొత్త బస్టాండ్ రోడ్ నెహ్రూ నగర్ రోడ్ రిక్కా బజార్ రోడ్లు ఆధునికరించాలి గోళ్ళపాడు కాలువ పైన ఏర్పాటుచేసిన పార్కులన్నీ సుందరీకరణ చేయాలి జాలి తీగలు తీసివేసి పార్కు చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలి ఈ నిర్మాణ పనులపై ఖమ్మం ఎమ్మెల్యే వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరావు గారు ప్రత్యేక దృష్టి పెట్టి కృషి చేయాలని సిపిఎం పార్టీ విజ్ఞప్తి చేస్తుంది మరియు ఇందిరమ్మ ఇండ్లు రాజకీయ జోక్యం లేకుండా అర్హత కలిగిన వారందరికీ అందించాలని కోరుతున్నాము. పైరవులకు తావి వద్దని అలాంటివి మంత్రి దృష్టికి వస్తే కఠినంగా వ్యవహరించాలని కోరుచున్నాము. అలాగే వృద్ధాప్య పింఛన్లు వితంతువు పింఛన్లు 2000 నుండి 4000 రూపాయలకు పెంచాలని వికలాంగులకు 4వేల రూపాయలు నుండి 6000 రూపాయలకు పెంచాలని కొత్త రేషన్ కార్డులు కూడా వెంటనే మంజూరు చేయాలని రేషన్ కార్డులకు ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకోవాలని దరఖాస్తులు తీసుకున్న వెంటనే విచారణ జరిపి రేషన్ కార్డులు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, పత్తిపాక నాగ సులోచన, షేక్ హిమామ్, ఎర్ర రంజిత్ ,షేక్ సైదులు, బండారు వీరబాబు, పోతురాజు జార్జి, మద్ది సత్యం, శీలం వీరబాబు, వేల్పుల నాగేశ్వర రావు, కొట్టే అలివేలు, బండారు సునీత, గబ్బెటి పుల్లయ్య, సారంగి పాపారావు, యర్రా నగేష్, చీకటిమల్ల శ్రీనివాసరావు, షేక్ బాబు, షేక్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

# డైట్‌కు మహార్ధశ



- మంత్రి తుమ్మల కృషితో విద్యార్థులకు ఉపయోగం
- 8.62కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు నేడు మంత్రి తుమ్మల శంకుస్థాపన

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

జిల్లా కేంద్రమైన ఖమ్మంలోని డైట్ కళాశాలకు మహార్ధశ లభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్న క్రమంలో ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయికి చేరుతున్నాయి. రాష్ట్రంలోని రెండు కళాశాలలకు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ హోదా లభించగా... అందులో ఖమ్మం నగరంలోని డైట్ కళాశాల ఒకటి. ఈ నేపథ్యంలో నిధులు తీసుకొచ్చి వాటిని అభివృద్ధి చేసేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కంకణం కట్టుకున్నారనే చెప్పుకోవచ్చు. జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డిస్ట్రిక్ట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్) ఖమ్మంలో 1990-91 సంవత్సరంలో ప్రవేశపెట్టబడింది. దీని ప్రధాన ఉద్దేశం జిల్లా స్థాయిలో విద్యా శిక్షణ కార్యక్రమాలను ప్రోత్సహించటం కోసం నెలకొల్పారు. అప్పుడు టిటిసి కోర్సు ఒక సంవత్సరం గా ఉండేది 150 సీట్లు ఉండేవి. ఈ సంస్థ అప్పటి నుండి ఉపాధ్యాయ శిక్షణకు ప్రాముఖ్యత ఇచ్చి, నాణ్యమైన విద్యావ్యవస్థను స్థాపించేందుకు దోహదపడింది. 1991లో, టేకులపల్లి గ్రామంలో కొత్త భవనాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ భవనాలు, శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు, ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధి, విద్యా శిక్షణ, పరిశోధనలు మరియు ఆవిష్కరణలు అందించేందుకు ఉపయోగపడుతున్నాయి. 1990లో డైట్ గా నామకరణం జరిగింది. 2000 సంవత్సరంలో డిప్లమా ఇన్ ఎడ్యుకేషన్ కోర్సు అంటే డి. ఈ. డి కోర్సు మొదలైంది. ఇది రెండు సంవత్సరాల కోర్సు దీనిలో సీట్లు 100 అంటే మొదటి సంవత్సరం 100 రెండో సంవత్సరంలో 100 మంది విద్యార్థి ఉపాధ్యాయులతో 200 మంది విద్యార్థి ఉపాధ్యాయులు ఈ కళాశాల యందు విద్యార్థి ఉపాధ్యాయులుగా శిక్షణ పొందుతూ ఉన్నారు. తరువాత జరిగిన మార్పులలో 2014-15 విద్యా సంవత్సరంలో డీఎడ్ కోర్సు డి ఈ ఎల్ ఎడ్ కోర్సుగా మారింది అంటే డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సుగా రూపొందింది. ఈ కోర్సు నందు కూడా మొదటి సంవత్సరం 100 సీట్లు రెండవ సంవత్సరం 100 సీట్లు ఉన్నాయి. వీటిలో 50 సీట్లు తెలుగు మీడియం 50 సీట్లు ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల కొరకు కేటాయించారు. ఈ కోర్సు అదే విధముగా కొనసాగుతూ ఉన్నది. ఈ భవనాలు విద్యా శిక్షణలో వృత్తి పూర్వ, వృత్యంతర శిక్షణ కార్యక్రమాలను నిర్వహించే ఒక ముఖ్య కేంద్రంగా మారాయి.

**కొత్త కోర్సులతో కొంత ఉపా□ధి**

ప్రస్తుతం డైట్‌లో డిఈడీ కోర్సు మాత్రమే నిర్వహిస్తుండగా... ఇక నుంచి సీఈఓతో డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సు కూడా రానున్నది. దీని ఆధారంగా అంగన్‌వాడి పిల్లలకు, ఎల్‌కెజీ పిల్లలకు బోధించేందుకు అవసరమైన టీచర్లు సన్నద్ధమవుతుంటారు. వీటితో పాటు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు కూడా ఉపాధ్యాయులకు శిక్షణనివ్వనున్నారు.

**కల్పించనున్న సౌకర్యాలివే...**

డైట్ కళాశాల సీఈఓగా అభివృద్ధి చెందటంతో అదనపు తరగతి గదులు, లైబ్రరీ రూమ్-1, కంప్యూటర్ రూమ్-1, సెమినార్ హాల్, ల్యాబ్‌లు -2, స్పెషల్ ఎడ్యుకేషన్‌యూనిట్ -1, రీసెర్చ్ అండ్ ఎన్విేషన్ సెంటర్-1, ప్రహరీగోడ, ప్రస్తుతం ఉన్న డైట్ కళాశాలకు మరమ్మత్తులు చేపట్టనున్నారు. అదే విధంగా మరుగుదొడ్ల నిర్మాణం, ఉన్న వాటికి మరమ్మత్తులు చేపట్టనున్నారు. మంచినీరు సౌకర్యం, పార్కింగ్ సౌకర్యం, క్యాంటీన్ తదితర సౌకర్యాలు కల్పించనున్నారు.

**నేడు మంత్రి తుమ్మల కృషి**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డైట్ కళాశాలకు నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. ఈ క్రమంలోనే 8.62కోట్ల రూపాయల నిధులు మంజూరు కాగా... వివిధ రకాల పనులు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి సిద్ధం చేయగా.. నేడు ఆ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారు.




# పేకాట స్థావరంపై దాడి

**బాల్కొండ, తెలంగాణ ముచ్చట్లు**

పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని భీమ్‌గల్ ఎస్సై జి.మహేష్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం భీమ్‌గల్ మండలం సంతోష్ నగర్ తండాలో కొందరు వ్యక్తులు మూడు ముక్కల పేకాటను డబ్బులతో బెట్టింగ్ పెట్టి ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి పేకాట స్థావరంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకొని,వారి దగ్గర నుండి రూ.18,350, 4 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# సీఎం కప్ 2024 రాష్ట్రస్థాయి పోటీలకు సర్వం సిద్ధం

- డిసెంబర్ 27 నుండి జనవరి 2 వరకు జరగనున్న పోటీలు
- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ గ్రామీణ క్రీడా రంగాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో.. మట్టిలో మాణిక్యాలను గుర్తించి వారి ప్రతిభకు ప్రోత్సాహం కల్పించాలన్న ఆశయంతో..పల్లెల నుంచి ప్రపంచ ఛాంపియన్లను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 రాష్ట్రస్థాయి పోటీలకు రంగం సిద్ధమవుతోంది. మొట్ట మొదటిసారిగా గ్రామీణ స్థాయి నుండి నిర్వహిస్తున్న ఈ పోటీలు గ్రామస్థాయి, మండల స్థాయి మరియు జిల్లా స్థాయి పోటీలు పూర్తిచేసుకుని డిసెంబర్ 27 నుండి జనవరి 2 వరకు రాష్ట్రస్థాయి పోటీలు ఒక పండుగ వాతావరణం లో నిర్వహించుకోబోతున్నాం. ఖమ్మం జిల్లా నుండి 24 క్రీడాంశాల్లో 422 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొంది, పాల్గొననున్నారు. ఇందులో పాల్గొంటున్న దాదాపు రెండు లక్షల మంది కి పైగా క్రీడాకారుల సమాచారాన్ని గేమ్స్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా సంక్షిప్తం చేయడం, క్రీడాకారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలు అందజేయడం క్రీడలకు ఆధునిక సాంకేతిక హంగులు సమకూర్చడం

**రాబోయే తరానికి దిక్సూచిలా**

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తోంది. ఈ క్రీడల్లో పాల్గొని క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయి. వివక్షతకు తావు లేకుండా పారా క్రీడాంశాలో పోటీలు నిర్వహించుకోవడం ఈ సీఎం కప్ పోటీలో మరో ప్రత్యేకత. ఒక యజ్ఞం లాగా నిర్వహిస్తున్న ఈ సీఎం కప్ 2024 విజయవంతం చేయడంలో యావత్తు తెలంగాణ క్రీడా సంఘాలు, పీఈటీలు ఫిజికల్ డైరెక్టర్లు స్వచ్ఛంద సంస్థలు పలువురు క్రీడాభిమానులు పాలుపంచుకుంటున్నారు.



# బిసి పొలిటికల్ జెఎసి వనపర్తి జిల్లా అధ్యక్షునిగా తిరుపతయ్య యాదవ్

**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**

బిసి పొలిటికల్ జెఎసి వనపర్తి జిల్లా అధ్యక్షునిగా పెబ్బేరు మండలం బునాదిపురం గ్రామానికి చెందిన వనం తిరుపతయ్య యాదవ్ గారిని నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచాల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.ఈ సందర్భంగా తిరుపతయ్య యాదవ్ మాట్లాడుతూ బీసీలను చైతన్యం చేసి బీసీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, బీసీల రాజ్యాధికారం కోసం పాటు పడతానన్నారు. త్వరలో అన్ని గ్రామ, మండల కమిటీలు వేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు అభ్యర్థులను సిద్ధం చేస్తామని తెలిపారు.నాపై నమ్మకముంచి జిల్లా బాధ్యత అప్పజెప్పిన స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ గారికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వెంకటన్న గౌడ్, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, మదనాపూర్ మండల అధ్యక్షుడు మహేందర్ నాయుడు, రాఘవేందర్ గౌడ్, మ్యాదరి రాజు, దేవర శివ, గౌతమ్ శంకర్, మల్లేష్ యాదవ్, వసంత చారి, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



# సత్తుపల్లిలో రామకృష్ణ వివేకానంద భక్త సమ్మేళనానికి విరాళం


**సత్తుపల్లి పట్టణం,తెలంగాణ ముచ్చట్లు:**

సత్తుపల్లి మాధురి ఫంక్షన్ హాల్‌లో డిసెంబర్ 28, 29 తేదీలలో జరగబోయే రామకృష్ణ వివేకానంద బావ ప్రచార పరిషత్ తెలంగాణ 6వ వార్షిక భక్త సమ్మేళనం కోసం శారద రెసిడెన్సి మరియు రామకృష్ణ యోగాసమితి తరపున చల్లగుళ్ల అప్పారావు రూ. 25,000 విరాళాన్ని అందించారు.ఈ విరాళం చెక్కులను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ చేతుల మీదుగా సమ్మేళనం నిర్వాహకులకు అందజేశారు. సమ్మేళనం విజయవంతం చేసేందుకు అందరి సహకారం కోరుతూ కార్యక్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సత్తుపల్లి అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, ప్రైవేట్ స్కూల్స్ భాద్యులు నాయుడు వెంకటేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు పాల్గొన్నారు.

# ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్ అప్రజాస్వామికం

- ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్‌ను ఖండించిన - మాజీ ఎంపీ నామ

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**



బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్‌ను ఖండిస్తూ, బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు ఒక ప్రకటన విడుదల చేశారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వకుండా అరెస్ట్ సరికాదు అన్నారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, దళిత, బహుజన వర్గాల హక్కుల కోసం నిస్వార్థంగా పని చేస్తున్న శ్రీనివాస్‌పై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ పై పెట్టిన కేసులను ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని నామ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# జి ఐ ఓ పట్టణ కమిటీ ఎన్నిక

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**



గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ( జి ఐ ఓ ) పట్టణ కమిటీ ఎన్నిక గురువారం ఖమ్మం నగరంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షు రాలిగా అస్కియా ఆసఫ్ , కార్యదర్శిగా సీమ నాజనీన్ లు ఎన్నికయ్యారు. వీరితోపాటు సందేశ కార్యదర్శిగా అమ్రిన్ ఉల్ హక్క, క్యాంపస్ ఆర్గనైజర్ గా మెహజుజా సిమ్రా, మీడియా ఇన్చార్జిగా హఫ్సా సాదియాలను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. సంఘం ఖమ్మం రీజినల్ ఆర్గనైజర్ ఖదిజతుల్ కుబ్రా, కొత్తగూడెం రీజినల్ ఆర్గనైజర్ హఫ్సా మెహ్విన్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఖదిజతుల్ కుబ్రా మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన పట్టణ కమిటీ కాల పరిమితి ఒక సంవత్సరం వరకు ఉంటుందని తెలిపారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారు బాధ్యతాయుతంగా తమ కర్తవ్యాలు నిర్వహించాలని సూచించారు. సంస్థ సందేశాలను విద్యాలయా లలో చేరవేయాలని , విద్యార్థినిలలో నైతిక విలువల స్థాపన కొరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా అసమానతలు లేని సమ సమాజాన్ని నిర్మించేందుకు పాటుపడాలని హితవు పలికారు.



# తెలంగాణ స్టైల్ లో భోజనం ప్రియులకు చేపల పులుసు తో స్పెషల్

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం నగరంలో ఖానాపురం తాటి బెల్లం పక్కన ఆహా ఏమి రుచి అనే విధంగా మన ఖమ్మంలో తెలంగాణ చాపల పులుసు హోటల్ ప్రారంభించడం జరిగినది. రుచికరమైన చాపల పులుసు , రొయ్యల ఫ్రై , చికెన్ కర్రీ , వెజ్ అండ నాన్వెజ్ కర్రీతో భోజనం హోటల్ ప్రారంభించడం జరిగినది . తక్కువ ధరలో రుచికరమైన భోజన పదార్థాలు రండి రుచికరమైన భోజనాలు తినండి . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహాసేన ఖమ్మం జిల్లా అధ్యక్షులు మంద సంజీవరావు పాల్గొని ప్రారంభించారు . ఈ ప్రోపరేటర్ టి కళ్యాణి , కే అశోక్ , టి. దశరథ , కె.మోహన్ , టీ.జోసెఫ్ నాయక్ , ఏ. నరేష్ , ఎం.శేషయ్య , ప్రవీణు , సాయి , అజయ్ , శ్యామల తదితరులు పాల్గొన్నారు .



# సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం

- సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా రాఘవేందర్

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా చింతల రాఘవేందర్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం ఆయన్ని నియమించడంతో పాటు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, 2005లో ప్రారంభమైన సమాచార హక్కు చట్టం ప్రతి పౌరునికి ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని వెలికితీయడానికి ముఖ్యమైన సాధనమని తెలిపారు. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన సమాచారం 30 రోజుల్లో అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో 48 గంటల్లో అందించాల్సి ఉంటుందని వివరించారు.ప్రతి పౌరుడు గ్రామ పంచాయతీ నుండి పార్లమెంటు వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని, ఈ చట్టాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అయితే ఈ చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా ప్రజా ప్రయోజనాలకే ఉపయోగించాలని సూచించారు.ఎన్నికైన చింతల రాఘవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ఈ చట్టం ప్రకారం అధికారులు 4 (1) బి ప్రకారం 17 అంశాల సమాచారాన్ని ప్రజలకు అందించాల్సిన బాధ్యత వహించాలని చెప్పారు. ప్రజా ప్రయోజనాలకు అవసరమైన సమాచారాన్ని సెక్షన్ 11 (1) ప్రకారం దరఖాస్తుదారులకు అందించాలన్నారు.సిబిఐ, సిఐడి, కోర్టు తీర్పులు, దేశ భద్రత, పోలీసు స్టేషన్ భద్రత, ఆయుధాల సమాచారం వంటి కొన్ని అంశాలు ఈ చట్టం పరిధిలోకి రాకపోయినా, ఇతరత్రా ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే అవినీతిని ప్రజలు ఈ చట్టం ద్వారా వెలికితీయవచ్చని వివరించారు.ఈ చట్టం సామాన్యుడి హక్కులను పరిరక్షిస్తూ, అవినీతిని అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తుందని నేతలు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు జి.ప్రియ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ ప్రతినిధి రాసునూరి లక్ష్మణ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ముచ్చర్ల మల్లేష్, జిల్లా కార్యదర్శి మాదగోని సత్యం తదితరులు పాల్గొన్నారు.



## దోపిడి పాలనకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర సిపిఐది

- హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**

దేశంలో దోపిడి పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కు దక్కుతుందని హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో సిపిఐ పార్టీ వంద సంవత్సరాల వేడుకల సందర్భంగా ఎర్రజెండా ఎగురవేసి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎల్లేష్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం కోసం సిపిఐ చేసిన త్యాగాలు ఆదర్శప్రాయమని, ఆ పార్టీనే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ సమసమాజ స్థాపన కోసం నిరంతరం పోరాటాలు చేస్తోందని తెలిపారు. దేశంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, దున్నేవానికి భూమి సిద్ధాంతంతో పేదలకు లక్షల ఎకరాలు పంచిన చరిత్ర సిపిఐ దేనని ఆయన గుర్తుచేశారు.

**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సిపిఐ చేసిన పాత్రను ఉద్ఘాటిస్తూ, వెట్టిచాకిరి, భూస్వామ్య వ్యవస్థలపై పోరాడి 3000 గ్రామాలను విముక్తం చేసి, ప్రజాస్వామ్య స్థాపనకు పునాది వేశారని ఎల్లేష్ వివరించారు. ఈ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టు నాయకులు ప్రాణాలు అర్పించారని, వారి త్యాగాలను గుర్తించి, నేటి తరం ప్రేరణగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**తరాలు నేర్చుకోవాల్సిన చరిత్ర**

భారత స్వాతంత్ర పోరాట చరిత్రను, ముఖ్యంగా సిపిఐ పోరాటాలకు సంబంధించిన అంశాలను పాఠ్యాంశాలలో చేర్చాలని ఎల్లేష్ డిమాండ్ చేశారు. నేటి సమాజంలో అన్యాయాలపై నిలదీయడానికి కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రజల గొంతుగా మారాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కొట్టె వెంకటేష్, జిల్లా నాయకులు మునిగాల బిక్షపతి, మాలోతు శంకర్ నాయక్, మహిళా నాయకురాలు దీన పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి పొంగులేటి

**సత్తుపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

తుంబూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బొందలపాటి శ్రీను తండ్రి బొందలపాటి రాఘవయ్య ఇటీవల మరణించగా, వారి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్,టిఐడిసి చైర్మన్ మువ్వా విజయ్ బాబు పాల్గొన్నారు.అదేవిధంగా, తుంబూరు గ్రామానికి చెందిన తాళ్లూరి సత్యావతి (చిట్టెమ్మ) ఇటీవల మరణించగా, వారి చిత్రపటానికి కూడా పూలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివ వేణు, మండల, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తాటి చెట్టు పై నుండి పడి గీతా కార్మికుడికి తీవ్ర గాయాలు

**మొగుళ్లపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన నాగపూరి వెంకటస్వామి 54 గీతా కార్మికుడు తాటి చెట్టు పై నుండి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. గమనించిన తోటి గీతా కార్మికులు చికిత్స నిమిత్తం ఆయనను ప్రైవేట్ వాహనంలో హన్మకొండకు తరలించారు. వివరాల్లోకి వెళితే మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన నాగపూరి వెంకటస్వామి వృత్తిరీత్యా గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో తాటి చెట్టు ఎక్కగా.. ప్రమాదవశాత్తు కాలు జారీ కింద పడడంతో ఆయన తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ క్రమంలో గమనించిన తోటి గీతా కార్మికులు హుటా హుటిన ప్రవేట్ వాహనాన్ని మాట్లాడి.. చికిత్స నిమిత్తం హన్మకొండకు తరలించారు. కాగా గీతా వృత్తినే నమ్ముకుని జీవనాధారాన్ని కొనసాగిస్తున్న నాగపూరి వెంకటస్వామి తాటి చెట్టు పై నుండి పడి తీవ్ర గాయాల పాలవడంతో ఆ కుటుంబం వీధిన పడే పరిస్థితి ఏర్పడిందని, వెంటనే ప్రభుత్వం స్పందించి ఆయనకు ఎక్స్గ్రేషియా ప్రకటించి, ప్రభుత్వమే వైద్యం చేయించేలా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగపూరి వెంకటస్వామిని ఆసుపత్రికి తరలించిన వారిలో గౌడ సంఘం నాయకులు బత్తిని రమేష్ గౌడ్, వేముల రమేష్ గౌడ్, బత్తిని తిరుపతి గౌడ్, వేముల కిరణ్ గౌడ్, వడ్లకొండ రవీందర్ గౌడ్, మాదారపు రవి గౌడ్, బత్తిని స్వామి గౌడ్, వెంకటేష్ గౌడ్, వేముల నందం గౌడ్ తదితరులున్నారు.





## ప్రజా సంక్షేమానికి కట్టుదిట్టమైన చర్యలు

- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం
- భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం
- పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల్లో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేసిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సంక్షేమానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం మంత్రి, ఖమ్మం ఎంపి రామ సహాయం రఘురాం రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి పెనుబల్లి మండల కేంద్రంలో ఎస్.డి.ఎఫ్. నిధులు 29 లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి పెనుబల్లి, కల్లూరు మండలాలకు చెందిన (105) మంది కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు మొత్తం ఒక కోటి 5 లక్షల 12 వేల 180 రూపాయల విలువ గల చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వంలో పేద ప్రజల కోసం ఇచ్చిన హామీలతో పాటు ప్రజలకు ఉపయోగపడే ఇతర పనులను సైతం చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం ఆర్థికంగా నష్టం చేస్తూ భారీగా అప్పులు చేసినప్పటికీ సాకులు చెప్పకుండా ప్రాధాన్యత క్రమంలో కార్యక్రమాలఅమలు చేస్తున్నామని అన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల వరకు రుణాలను మాఫీ చేశామని, రాష్ట్రంలోని 25 లక్షల పైగా రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, సన్న వడ్లకు క్వింటాల్ 500 రూపాయల బోనస్ ఇచ్చామని, పేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలు 40 శాతం, పిల్లల కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచడం జరిగిందని అన్నారు. గతంలో 2004 నుంచి 2014 వరకు ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ ప్రాంతంలో 25 లక్షల 30 వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తే , గత ప్రభుత్వ హయాంలో రెండు పడక గదుల ఇండ్ల పేరిట ప్రజల చిరకాల కోరికను విస్మరించారని అన్నారు. మన ఇందిరమ్మ రాజ్యంలో మొదటి సంవత్సరంలోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున మొత్తం 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు.

రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని అన్నారు. పాలేరుతో సమానంగా సత్తుపల్లి నియోజకవర్గానికి ఇండ్లు మంజూరు చేస్తానని అన్నారు. పేద రైతులకు ఉన్న భూమికి భరోసా కల్పించేందుకు భూభారతి 2024 చట్టం తెచ్చుకున్నామని అన్నారు. రాబోయే రెండు, మూడు నెలల్లో భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. పెనుబల్లి లో మెయిన్ రోడ్ విస్తరణ, డ్రైయిన్ల నిర్మాణం సంబంధించి నిధులు మంజూరు చేస్తామని అన్నారు. మీ సేవా కేంద్రం మంజూరు చేస్తానని, పెనుబల్లి ప్రెస్ క్లబ్ కోసం ప్రతిపాదనలు అందించాలని, పెనుబల్లి గ్రామపంచాయతీని నగర పంచాయతీగా అందరి ఆమోదంతో చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపి రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు ఇల్లు అందించడం జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే కోరిన విధంగా 33 ఊర్లకు కొంతమేర ఎంపీ నిధులతో, మరికొన్ని ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన నిధులతో చేసేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ పేదల పక్షపాతిగా ఉన్న ఇందిరమ్మ ప్రభుత్వం రాష్ట్రానికి అప్పులు ఉన్నప్పటికీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని అన్నారు. మన మండలానికి 105 కల్యాణ లక్ష్మి చెక్కులు మంజూరయ్యాయని, వీటి ద్వారా పేదలకు కోటి 5 లక్షల రూపాయలు పంపిణీ చేస్తున్నామని అన్నారు.అనంతరం మంత్రి కల్లూరు మండలం పాయాపూర్ గ్రామంలో సి.ఆర్.ఆర్. నిధులు 2 కోట్లతో, తల్లాడ మండలం అంబేద్కర్ నగర్ లో 2 కోట్లతో చేపట్టిన బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్, కల్లూరు ఆర్డీఓ రాజేందర్, తహసీల్దార్లు, పంచాయతీ రాజ్ ఈ. ఈ. రాంకోటి, డి.ఈ. రాంబాబు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### భారతీయ జనతా పార్టీ
## బూత్ కమిటీ సమావేశం

**పాలకుర్తి,తెలంగాణ ముచ్చట్లు**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలో 1,2,3,4, బూత్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దొంగరి మహేందర్ మండల అధ్యక్షులు దుంపల సంపత్ జిల్లా నాయకులు కమ్మగాని శ్రీకాంత్ ప్రధాన కార్యదర్శి మారం రవి వేల్పుల దేవరాజ్ ఉపాధ్యక్షులు ఇర్ల రాజు కార్యదర్శి ఘన ఘన రాజు విజయం మండల అధ్యక్షులు గోనే అమరేందర్ మొగిలి వంశి చిక్కుడు అశోకు, సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



### మృతులకు రూ..25 లక్షల
## పరిహారం చెల్లించాలి

- మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి

**మెదక్, తెలంగాణ ముచ్చట్లు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా విద్యుత్ వైర్ల కింద కట్టిన ఫ్లెక్సీలు తీస్తుండగా విద్యుత్ షాక్ తో మృతి చెందిన నవీన్, ప్రశాంత్ కుటుంబాలను టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు వారికి చెరువు 25 లక్షల చొప్పున పరిహారం చెల్లించి ఆదుకోవాలని అన్నారు





## కమ్యూనిస్టుల పురోగమనమే దేశానికి రక్ష

- కమ్యూనిస్టుల త్యాగాలతో పుణీతమైన తెలంగాణ
- సి.పి.ఐ పోరాటాలు సువర్ణాక్షర లిఖితం
- ఎర్రజెండాల ఐక్యతేదేశానికి ప్రత్యామ్నాయం
- విచ్ఛిన్నకర శక్తి ఆర్.ఎస్.ఎస్.తో దేశాని పొంచివున్నప్రమాదం
- శతజయంతిసభలో కూనంనేని

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

కమ్యూనిస్టుల పురోగమనమే దేశానికి రక్షఅని యావత్ దేశంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని పురోగమనం తప్పదని భారత కమ్యూనిస్టుపార్టీ సి.పి..ఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఎ99 ఏళ్ళ కమ్యూనిస్టుపార్టీ సుదీర్ఘచిరత్రలో అనేక పోరాటాలు, ప్రజా ఉద్యమాలు, త్యాగలున్నాయని కార్మిక, కర్షక హక్కుల కోసం పోరాడిన ఏకైక పార్టీ సి.పి.ఐ మాత్రమేనన్నారు. భారత కమ్యూనిస్టుపార్టీ శతవంత సంవత్సరలోకి అడుగిడుతున్న సందర్భంగా గురువారం సి.పి.ఐ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పాత ధర్నా చౌక్ నుండి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు సాగిన ప్రదర్శన అనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో సి.పి.ఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేస్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ పార్టీ పుట్టుక నుంచి అనేక నిర్భందాలను ఎదుర్కొన్నదని దాదాపు ఒకే సమయంలో సమయంలో ఆవిర్భవించిన ఆర్.ఎస్.ఎస్. దేశ విచ్ఛిన్నాన్ని కోరుకుంటే భారత కమ్యూనిస్టుపార్టీ కార్మికులు, కర్షకులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిందన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ సంపన్నవర్గాల కోసం పనిచేసిందని టాట, బిర్లా, గోయంకా, మఫత్లాల్ లాంటి పారిశ్రామిక వేత్తల కోసం కాంగ్రెస్ పనిచేసిందన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్య నినాదం కూడా కమ్యూనిస్టులదేనని కూనంనేని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా అనేక చట్టాలొచ్చాయని అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని సాంబశివరావు తెలిపారు. ప్రపంచ చరిత్రలో వినుతికెక్కిన తెలంగాణా రైతాంగ సాయుధపోరాటం తెలంగాణ ప్రజల జీవన గతిని మార్చిందని ఈ పోరాటంలో అనేక వేలమంది అమరులయ్యారని ఆయన తెలిపారు. నాటి నుండి నేటి తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వరకు కమ్యూనిస్టుల తాగ్యాగలతో తెలంగాణ పుణీతమైందన్నారు.

రావి నారాయణరెడ్డి, మఖ్దూ మెహినుద్దీన్ బద్దం ఎల్లారెడ్డి పిలుపుతో మొదలైన సాయుధ తెలంగాణ సంగ్రామం తెలంగాణ ప్రజల జీవితాలలో వెలుగును నింపిందని భూస్వామ్య వ్యవస్థపోయి కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా భూమి పేదల పరమైందన్నారు. తెలంగాణ సాధనోద్యమంలో కమ్యూనిస్టులు అత్యంత కీలకభూమిక పోషించారన్నారు. భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఖమ్మం జిల్లాకు ఒక ప్రత్యేక స్థానం ఉందని నల్లమల గిరి ప్రసాద్, మహ్మద్ రజబ్ అలీ, దేవూరిశేషగిరిరావు, సర్వదేవభట్ల రామానధం, మనబోతుల కుమరయ్యతో సహా వందలాది మంది ప్రజల అభ్యున్నతి కోసం త్యాగాలు చేశారని వారి త్యాగలకు వారసులుగా కమ్యూనిస్టులుగా ఉన్నందులకు మేము గర్వపడుతున్నామని సాంబశివరావు తెలిపారు. పూటకోపార్టీ మారేవారు. కమ్యూనిస్టులను విమర్శిస్తున్నారని నీతి, రీతీ లేని వారు ఇటు వంటికు విమర్శలు చేస్తుంటారని ఆయన అన్నారు.కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని మతోన్మాద శక్తులు బరితెగించిన వేళ దేశంలో లౌకిక వాదం ప్రమదంలో పడిందని ఆర్.ఎస్.ఎస్., బీజీపీలతో దేశంలో ప్రజాస్వామానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. వామపక్ష శక్తుల ఐక్యత ఈ దేశంలో మతోన్మాధ బూర్జువా రాజకీయపార్టీలకు ప్రత్యామ్నాయంగా మారుతుందని కూనంనేని తెలిపారు. భవిష్యత్లో కమ్యూనిస్టుల ఐక్యత విలీనానికి సి.పి.ఐ కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

**పోరాల పురిటిగడ్డ ఖమ్మం బాగం**

కమ్యూనిస్టుపార్టీ చరిత్రలో పోరాటాల పురిటిగడ్డగా ఖమ్మం ఖ్యాతి గడించిందని, అమరుల త్యాగాలు అనన్య పోరాటాలు ఖమ్మం జిల్లాలో ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించాయని సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి ఓ ఉద్యమ చరిత్ర ఉందన్నారు. సి.పి.ఐ శత సంవత్సర ఆవిర్భాభ సభలో హేమంతరావు మాట్లాడుతూ గణేశ్వరం, వినోభానగర్, తోటపల్లి లాంటి చారిత్రిక భూపోరాటాలకు కమ్యూనిస్టుపార్టీ నేతృత్వం వహించిందన్నారు. కమ్యూనిస్టుపార్టీ వందో సంవత్సరంలోకి పెరిగుడుతున్న సందర్భంగా ప్రజా పోరాటాలకు పునరంకితమవుతుందన్నారు. ఈ సభలో సి.పి.ఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, సి.పి.ఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మెన్ మహ్మద్ మౌలానా ప్రసంగించగా రాష్ట్ర సమితిసభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, యర్రాబాబు, ఎస్.కె. జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, కోట్ల రూపాయల బయ్యారం ఖనిజ సంపద ప్రైవేట్ వ్యక్తుల పరం కాకుండా కాపాడి ఘన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. రైతాంగ కార్మిక, పేద ప్రజల కోసం చారిత్రక పోరాటాలను కమ్యూనిస్టుపార్టీ నిర్వహించిందన్నారు.జిల్లా కార్య వర్గసభ్యులు, ప్రజాసంఘాల బాధ్యులు వేదికపై ఆశీనులయ్యారు.ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీలో పనిచేసిన పువ్వాడ నాగేశ్వరరావు, మహ్మద్ మౌలానా, డాక్టర్ పి. గోర్కి సహా 39 మంది సీనియర్ కమ్యూనిస్టులను సన్మానించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అంతవరకు చెప్పులు వేసుకోను..
# అన్నామలై భీష్మ ప్రతిజ్ఞ

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**



రాజధాని చెన్నైలోని అన్నాయూనివర్సిటీలో ఓ విద్యార్థినిపై అత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టిస్తోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పిపోయాయని, దీనికి అధికార డీఎంకే ప్రభుత్వమే కారణమని భాజపా విమర్శలు గుప్పిస్తోంది. ఈ క్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై భీష్మ ప్రతిజ్ఞ చేశారు. డీఎంకే అధికారం కోల్పోయేంత వరకు తాను పాదరక్షలు ధరించబోనని ప్రతినబూనారు. గురువారం కోయంబత్తూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

'' డీఎంకే ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు నేను పాదరక్షలు ధరించను. చెప్పులు లేకుండానే నడుస్తా. ఎన్నికల్లో విజయం సాధించడానికి ఎప్పటిలాగే డబ్బులు ఎరగా చూపం. రూపాయి కూడా పంచకుండా ఎన్నికలకు వెళ్తాం. ఎన్నికల్లో విజయం సాధించేంత వరకు చెప్పులు ధరించను'' అని అన్నామలై అన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలో చెడు అంతమైపోవాలని కోరుతూ కోయంబత్తూరులోని తన నివాసంలో ఆరు కొరడా దెబ్బలు భరించి... మురుగన్‌కు మొక్కు చెల్లించుకుంటానని అన్నారు. రాష్ట్రంలోని ఆరు మురుగన్ క్షేత్రాలను దర్శించుకునేందుకు 48 గంటలపాటు ఉపవాస దీక్ష చేపడతానన్నారు.మరోవైపు అన్నా యూనివర్సిటీకి చెందిన బాధిత విద్యార్థిని ఫిర్యాదుకు సంబంధించిన 'ఎఫ్ఐఆర్'ను లీక్ చేయడంపై అన్నామలై మండిపడ్డారు. ఆమె వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లేలా పోలీసు అధికారుల తీరు ఉందని విమర్శించారు. లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు జ్ఞానశేఖరన్‌పై రౌడీషీట్ తెరవలేదని, డీఎంకేతో అతడికున్న సంబంధాలే అందుకు కారణమని ఆరోపించారు. పక్కా ప్రణాళిక ప్రకారం కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.



# ఐఏఆర్ఐ డైరెక్టర్‌గా తెలుగు వ్యక్తి

**తెలంగాణ ముచ్చట్లు, సెంట్రల్ డెస్క్**

భారత వ్యవసాయ పరిశోధన సంస్థకు డైరెక్టర్‌గా మొట్టమొదటిసారి ఒక తెలుగు వ్యక్తిని నియమించారు. ప్రస్తుతం నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీనివాసరావును ఐఏఆర్ఐకు డైరెక్టర్‌గా నియమించారు. ఈ సంస్థకు డైరెక్టర్‌గా ఒక తెలుగు వ్యక్తిని నియమించడం ఇదే మొదటిసారి. శ్రీనివాసరావు 1965 అక్టోబరు 4న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా అనిగండ్లపాడులో జన్మించారు. 197580 వరకు అనిగండ్లపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న తర్వాత.. బాపట్ల వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చరల్ బీఎస్సీ పట్టా అందుకున్నారు. ఆతరువాత శ్రీనివాసరావు ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. దీని తరువాత ఇజ్రాయెల్ టెల్అవివ్ విశ్వవిద్యాలయంలో పోస్ట్‌డాక్టోరల్ చేశారు. చదువు అయ్యాక శ్రీనివాసరావు భారత్‌లోని పలు పరిశోధన సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేశారు.



# బ్రిటన్ రాజుగా విలియం?

**తెలంగాణ ముచ్చట్లు, సెంట్రల్ డెస్క్**

బ్రిటన్ రాజు మూడో ఛార్లెస్ తన కుమారుడిని, కోడల్ని రాజు, రాణిగా పట్టాభిషేకం చేయించనున్నారా? రాజు ఇటీవల తన కోడలు కేట్ మిడిల్టన్‌తో సమావేశాన్ని నిర్వహించడం అదే అంతరంగాన్ని సూచిస్తోందని అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. రాకుమారుడు విలియం ఆయన సతీమణి కేట్ మిడిల్టన్ రాజురాణిగా బాధ్యతలు నిర్వర్తించేందుకు ముందుగానే సిద్ధమవుతున్నట్లు కొద్దికాలంగా ప్రచారం జరుగుతోంది. తాజా పరిణామం ఆ ఊహాగానాలకు బలం చేకూర్చుతున్నాయి.

విలియం రాజుగా సింహాసనాన్ని అధిష్టించే విషయంలో రాజ కుటుంబంలో కొంత కాలంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో క్యాన్సర్ బారినపడిన ఛార్లెస్ ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో ఆయన పదవీ పరిత్యాగంపై ప్రచారం మరింత ఊపందుకుంది. మార్చిలో నిర్వహించిన ఓ సమావేశంలో కేట్ మిడిల్టన్ మాట్లాడుతూ తాను కూడా క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు వెల్లడించారు. చికిత్స కొనసాగుతున్న సమయంలో మామ, కోడలికి పరస్పర అనుబంధం బలపడిందని పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ప్రస్తుతం కేట్ క్యాన్సర్ నుంచి కోలుకొని ఇప్పుడిప్పుడే మళ్లీ ప్రజల్లోకి వస్తున్నారు.

**విలియం సిద్ధం!**

మరోవైపు విలియం రాజ కిరీటాన్ని ధరించేందుకు సిద్ధమవుతున్నారని రాయల్ బయోగ్రాఫర్ బెడెల్ స్మిత్ చెప్పినట్లుగా పీపుల్ పత్రిక ఇటీవల ఓ కథనం వెలువడింది. "ప్రస్తుతం రాజు తన విధులను నిర్వహిస్తున్నప్పటికీ.. క్యాన్సర్ చికిత్స కారణంగా ఆయన కొన్ని పరిమితులకు లోబడి పనిచేయాల్సి వస్తోంది. దాంతో యువరాజు విలియంపై మరిన్ని అదనపు బాధ్యతలు పడ్డాయి. ఈ పరిణామాలు చూస్తుంటే ఊహించిన దానికంటే ముందుగానే విలియంకేట్ బ్రిటన్ రాజురాణిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీనికి వారు కూడా ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు" అని స్మిత్ తెలిపారు.

రాణి ఎలిజబెత్ మరణం తర్వాత ఆమె కుమారుడు మూడవ ఛార్లెస్ రాజుగా బాధ్యతలు చేపట్టారు. అయితే, 76 ఏళ్ల ఛార్లెస్ ఈ మధ్య తరచూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటుండటంతో ఆయన ఆరోగ్యంపై రాజకుటుంబంలో ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో వీలైనంత త్వరగా విలియంను రాజుగా ప్రకటించడానికి వారు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.




# క్రెడిట్ కార్డ్ హోల్డర్స్‌కు షాక్

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

క్రెడిట్ కార్డు బకాయిలపై బ్యాంకులు 30శాతానికి పైగా వడ్డీ వసూలు చేసుకోవచ్చని సుప్రీం కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 16ఏళ్ల నాటి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ NCDRC తీర్పును పక్కన పెట్టింది. ఈ మేరకు విచారణ జరిపిన జస్టిస్ బేలా ఎమ్ త్రివేది, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ధర్మాసనం NCDRC ఇచ్చిన తీర్పు చట్టువిరుద్ధం అని గురువారం తేల్చిచెప్పింది. అది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాఆర్‌బీఐ అధికారాల్లో జోక్యం చేసుకోవడమే అని పేర్కొంది. అంతేకాకుండా ఆ తీర్పు బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్1949 ఉద్దేశానికి విరుద్ధం అని చెప్పింది.

**'NCDRCకి ఆ అధికారం లేదు'**

క్రెడిట్ కార్డు హోల్డర్లను మోసం చేయడానికి బ్యాంకులు ఎలాంటి తప్పుడు సమాచారం ఇవ్వలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. అంతేకాకుండా బ్యాంకులు, క్రెడిట్ కార్డు హోల్డర్ల మధ్య కుదిరిన ఒప్పందం నిబంధనలను తిరిగి రాయడానికి NCDRCకి ఎలాంటి అధికార పరిధి లేదని స్పష్టం చేసింది. ఏకపక్షంగా ఆధిపత్యం చెలాయించే లేదా అన్యాయమైన నిబంధనలు ఉన్న ఒప్పందాలను పక్కన పెట్టే, వాటిపై నిర్ణయం తీసుకునే అధికారం మాత్రమే NCDRCకి ఉందని తెలిపింది. అయితే విధించే వడ్డీ రేటు, ఆర్‌బీఐ ఆదేశాల గురించి ఎప్పటికప్పుడు బ్యాంకులు క్రెడిట్ కార్డు హోల్డర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపింది. వడ్డీ విధింపు అన్యాయంగా, ఏకపక్షంగా ఉండకూడదని స్పష్టం చేసింది.

**'బ్యాంకులు అలా చేయాలి'**

సరైన సమయంలో పేమెంట్లు పూర్తి చేయడం, ఆలస్య రుసుం వంటి బాధ్యతలు, హక్కుల గురించి క్రెడిట్ కార్డు హోల్డర్లకు బ్యాంకులు అవగాహన కలిగించాలని ధర్మాసనం సూచించింది. క్రెడిట్ కార్డ్ సదుపాయాన్ని పొందే సమయంలో, వడ్డీ రేటుతో సహా అత్యంత ముఖ్యమైన నిబంధనలు, షరతుల గురించి వినియోగదారులకు స్పష్టంగా తెలిసేలా బ్యాంకులు చూడాలని తెలిపింది. సంబంధిత బ్యాంకులు జారీ చేసిన నిబంధనలు, షరతులకు కట్టుబడి ఉండటానికి కస్టమర్లు అంగీకరించాలని సూచించింది. క్రెడిట్ కార్డు నిబంధనలు ఫిర్యాదుదారులకు తెలిసిన తర్వాత లేదా క్రెడిట్ కార్డు జారీకి ముందు బ్యాంకులు ఆ వివరాలను వెల్లడించిన తర్వాత వడ్డీ రేటు సహా ఆ నిబంధనలను NCDRC పునఃపరిశీలించలేదని స్పష్టం చేసింది.అయితే, ఈ కేసులో ఆర్‌బీఐ జారీ చేసిన పాలసీ ఆదేశాలకు విరుద్ధంగా ఏ బ్యాంకు కూడా ప్రవర్తించిందనటానికి ఎలాంటి ఆధారాలు లేవని తెలిపింది. అంతేకాకుండా బ్యాంకులు విధించిన అధిక వడ్డీ రేటుపై అభ్యంతరాల గురించి బాధిత వర్గం ఆర్‌బీఐని సంప్రదించలేదని తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొంది.

**ఏమిటీ కేసు?**

క్రెడిట్ కార్డు బిల్స్ ఆలస్య చెల్లింపులపై వార్షికంగా 30 శాతానికి మించి వడ్డీ వసూలు చేయరాదని ఎన్‌సీఈడీఆర్‌సీ 2008లో తీర్పు వెలువరించింది. ఆలస్య చెల్లింపులపై బ్యాంకులు 36నుంచి 49 శాతం మేర వడ్డీ వసూలు చేస్తుండడంపై ఆవాజ్ ఫౌండేషన్ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించడం వల్ల ఈ తీర్పు వెలువడింది. దీనిపై సిటీ బ్యాంక్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, హెచ్‌ఎస్‌బీసీ, స్టాండర్డ్ చార్టర్డ్ వంటి కొన్ని బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. తొలుత స్టే ఇచ్చేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు 2009లో ఎన్‌సీఈడీఆర్‌సీ తీర్పును నిలిపివేసింది. దాదాపు 16 ఏళ్ల తర్వాత ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెడుతూ కమిషన్ ఆదేశాలను పక్కన పెట్టింది. క్రెడిట్ కార్డు బకాయిలపై బ్యాంకులు 30శాతానికి పైగా వడ్డీ విధించవచ్చని తీర్పునిచ్చింది.



# 'ఎన్నికల సంఘంపై ప్రజలకు నమ్మకం పోతోంది

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై సందేహాలు తలెత్తుతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆరోపించారు. మోదీ సర్కారు వైఖర అందుకు కారణమన్న ఆయన, రాజ్యాంగ సంస్థలన్నింటినీ తన గుప్పెట్లో పెట్టుకునేందుకు యత్నిస్తోందని విమర్శించారు. జవహర్‌లాల్ నెహ్రూ, గాంధీ సిద్ధాంతాలు, బీఆర్ అంబేద్కర్ గౌరవం కోస చివరి శ్వాస వరకు కాంగ్రెస్ పోరాడుతుందని గురువారం బెళగావిలో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశంలో స్పష్టం చేశారు. త్వరలోనే పార్టీ పదవులన్నింటినీ భర్తీ చేస్తామని ప్రకటించారు. మహాత్మాగాంధీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి అయిన వర్కింగ్ కమిటీ కర్ణాటక బెళగావిలో ప్రత్యేకంగా సమావేశమైంది. బెళగావిలో జరిగిన కార్యక్రమంలోనే మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించగా అదేచోట నవ సత్యాగ్రహ బైఠక్ పేరుతో తాజా సమావేశాన్ని ఆ పార్టీ అధినాయకత్వం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఇతర సీనియర్ నేతలు హాజరయ్యారు. అనారోగ్యం కారణంగా సోనియా గాంధీ ఈ సమావేశానికి రాలేదు. వీడియో రూపంలో తన సందేశాన్ని పంపారు. వచ్చే ఏడాది రాజకీయంగా, ఎన్నికల పరంగా అనుసరించాల్సిన వ్యూహాలపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమాలోచనలు జరిపింది.

'ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం పోతోంది'

సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఉద్దేశించి ప్రారంభ ఉపన్యాసం చేసిన ఖర్గే రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. అమిత్ షా అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడినప్పటికీ ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వం తప్పును ఒప్పుకునే స్థితిలో లేరని విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత గౌరవం కోసం పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. రాజ్యాంగ సంస్థలను సైతం మోదీ సర్కారు నియంత్రిస్తోందని ఆరోపించిన ఖర్గే, అందుకు ఎన్నికల సంఘమే ఉదాహరణ అని పేర్కొన్నారు. మోదీ సర్కార్ వైఖరి కారణంగా ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోందని ఖర్గే ఆరోపించారు.

**కష్టపడడం మాత్రమే సరిపోదు : ఖర్గే**

ఓటరు జాబితాలో పేర్లు ఇష్టారీతిన తొలగించడం, చేర్చడం., పోలింగ్ శాతం ఒక్కసారిగా పెంచడం వంటి అనేక ప్రశ్నలకు ఈసీ సంతృప్తికరమైన సమాధానం చెప్పడం లేదని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. 2025లో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్న ఖర్గే పార్టీపరంగా ఖాళీలన్నింటినీ భర్తీచేస్తామని ప్రకటించారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసేవారిని గుర్తిస్తామన్న ఆయన వారికి సముచిత ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. కష్టపడి పనిచేయడం మాత్రమే సరిపోదన్న ఖర్గే సమయానుకూలంగా నిర్మాణాత్మక వ్యూహరచన, దిశానిర్దేశం కూడా అవసరమేనని పేర్కొన్నారు.

**గాంధీ హంతకులను కీర్తించారు : సోనియా గాంధీ**

సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఉద్దేశించి సందేశం పంపిన మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, మహాత్మాగాంధీ ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్నవారు మహాత్ముడి వారసత్వం, సిద్ధాంతాలను ప్రమాదంలో పడేశారని ఆమె ఆరోపించారు. వాటిని పరిరక్షించేందుకు కాంగ్రెస్ శ్రేణులంతా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు దేశ స్వాతంత్ర్యం కోసం ఏనాడూ పోరాడలేదన్న ఆమె మహాత్మాగాంధీని తీవ్రంగా వ్యతిరేకించాయని పేర్కొన్నారు. ఆయా సంస్థలు అప్పటి వాతావరణాన్ని కలుషితం చేయడం వల్లే గాంధీజీ హత్యకు దారితీసిందన్నారు. పైగా గాంధీ హంతకులను కీర్తించారని విమర్శించారు. ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు పార్టీ సంస్థాగతంగా బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.





# లేడీ రైడర్ సోలో సాహసం

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

ఇల్లు, కన్న బిడ్డకు దూరంగా 371 రోజులు.. అతి కష్టమైన లక్ష్యం.. అడుగడుగునా సవాళ్లే.. అయినా ధైర్యం చెక్కు చెదరలేదు! ఒంటరిగా బైక్‌పై 64 దేశాలను చుట్టేసి ఔరా అనిపించింది ఓ లేడీ రైడర్. మహిళలకు దాదాపు అసాధ్యం అనుకున్న అరుదైన లక్ష్యాన్ని ఛేదించింది. ఆమెనే అసోంకు చెందిన ప్రొఫెషనల్ బైక్ రైడర్, ఫిట్‌నెస్ ట్రైనర్ మీనాక్షి దాస్(41). మీనాక్షి చేసిన ఈ సోలో వరల్డ్ టూర్ గురించి మరిన్ని వివరాలు తెలుసుకుందాం.

**64 దేశాలు చుట్టేసి!**

2023 డిసెంబర్ 17న మీనాక్షి దాస్ తన ప్రయాణం ప్రారంభించింది. మొదటగా నేపాల్‌కు వెళ్లి అక్కడి నుంచి మళ్లీ ముంబయికి వచ్చింది. ముంబయి నుంచి విమానంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు(యూఏఈ) వెళ్లింది. అక్కడి నుంచి బైక్‌పై ఖతార్, బహ్రెయిన్, సౌదీ అరేబియా, జోర్డాన్, ఇరాన్, అర్మేనియా, జార్జియా, తుర్కియే, బల్గేరియా, మోల్డోవా, రొమేనియా, సెర్బియా, మాసిడోనియా, గ్రీస్, అల్బేనియా, క్రొయేషియా, మోంటెనెగ్రో, స్లోవేనియా, స్లోవేనియా, హంగరీ, ఆస్ట్రియా, బోస్నియా, హెర్ట్‌సగొవినియా, చెక్ రిపబ్లిక్, ఇటలీ, మొనాకో, వాటికన్, స్విట్జర్లాండ్, లీచ్‌టెన్‌స్టెయిన్, జర్మనీ, లక్సెంబర్గ్, లిథువేనియా, బెల్జియం, పోలాండ్, నెదర్లాండ్, స్పెయిన్, ఫ్రాన్స్, పోర్చుగల్, ఇంగ్లండ్, స్కాట్లాండ్, ఐర్లాండ్, వేల్స్, డెన్మార్క్, ఫిన్‌లాండ్, స్వీడన్, నార్వే , లాట్వియా, రష్యా, చైనా, కజఖ్‌స్థాన్, లావోస్, వియత్నాం, కంబోడియా, థాయిలాండ్, మలేసియా, ఇండోనేసియా, సింగపూర్ ఇలా మొత్తం 64 దేశాలను చుట్టేసింది. మీనాక్షి ప్రయాణం 2024 డిసెంబర్ 22న ముగిసింది.

**ఎన్నో అడ్డంకులు**

అయితే, మీనాక్షి ప్రయాణం అనుకున్నంత సాఫీగా సాగలేదు. ప్రయాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయి. కొన్ని దేశాల్లో వీసా మంజూరులో అనేక సమస్యలు ఎదుర్కొంది మీనాక్షి. "కొన్ని దేశాల్లో ప్రయాణించేటప్పుడు బైక్ చాలా దెబ్బతింది. కొన్ని ప్రాంతాల్లో దుమ్ము తుపానులను ఎదుర్కొన్నాను. కొన్ని చోట్ల ప్రమాదాలకు గురయ్యాను. ఆయా దేశాల్లో నివసిస్తున్న అస్సామీలు, భారతీయులు, స్థానికులు నాకు సహాయం చేశారు. కొంతమంది వీసా ప్రాసెస్‌లో సహాయ పడ్డారు. మరికొంత మంది ఆర్థికంగా సాయం చేశారు. వసతి సౌకర్యం, ఆహారం అందించారు. ఈ ఏడాది ప్రయాణంలో నేను చాలా విషయాలు నేర్చుకున్నాను" అని మీనాక్షి దాస్ 'ఈటీవీ భారత్' తో చెప్పింది.

**భూమి తాకట్టు పెట్టి**

బైక్‌పై ప్రపంచాన్ని చుట్టిరావాలనే కోరిక ఉంటే సరిపోదు. దానికి కావాల్సిన వనరులన్నీ ఉండాలి. కానీ సంకల్పం గొప్పదైతే కావాల్సినవన్నీ సరైన సమయానికి మన దరికి చేరుతాయి. మీనాక్షి విషయంలో కూడా ఇలాగే జరిగింది. మొదట్ బైక్ చేయాలని ప్రణాళిక వేసుకున్నప్పుడు ఆర్థిక సవాళ్లు ఎదురయ్యాయి. భారత్ వెలుపల స్పాన్సర్లు దొరకలేదు. అయినా మీనాక్షి తన ప్లాన్‌ను మార్చుకోలేదు. తన లక్ష్యం కోసం భూమిని తాకట్టు పెట్టడానికి కూడా మీనాక్షి వెనుకాడలేదు.

"నా ప్రయాణానికి మొత్తం రూ.20 లక్షల వరకు ఖర్చు అయ్యింది. తెలిసినవారి సహాయ సహకారాల వల్ల నేను ఈ ప్రయాణాన్ని పూర్తి చేయగలిగాను. అయితే దీని కోసం నేను నా భూమిని తాకట్టు పెట్టాల్సి వచ్చింది. ప్రభుత్వం నుంచి నాకు ఎలాంటి సహాయం అందలేదు. అయితే, అసోం క్రీడా శాఖ మంత్రి నందిత గార్లోసా రూ.1 లక్ష ఇచ్చారు." అని మీనాక్షి తెలిపింది.

ఈ సాహసం చేయడానికి కారణం ఏంటి?

ఈ సాహసం చేయడానికి గల కారణం ఏమిటని 'ఈటీవీ భారత్' మీనాక్షి దాస్‌ను ప్రశ్నించింది. మహిళల సాధికారతే లక్ష్యంగా ఈ ప్రయాణం ప్రారంభించినట్లు వెల్లడించింది ఆమె. "మహిళలు ఏమీ సాధించలేరని చాలా మంది అంటుంటారు. కానీ మహిళల కోసం బైక్‌పై ఒంటరిగా 64 దేశాలు ప్రయాణించి రికార్డు సృష్టించాను. విజయం సాధించాను." అని మీనాక్షి చెప్పింది. అయితే 67 దేశాలు చుట్టేయాలని మొదటి మీనాక్షి టార్గెట్‌గా పెట్టుకుంది. కానీ కొన్ని భద్రతా కారణాల వల్ల ఒమన్, ఇరాక్, మయన్మార్‌లో ప్రవేశించడానికి ఆమెకు అనుమతి లభించలేదు.



# సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలు సేకరణ'


○ **'చిన్నారులకు వేం నరేందర్‌రెడ్డి అభినందనలు'**

**తుర్కయంజాల్, తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పథకానికి విరాళాలు సేకరిస్తున్న తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ హెవెన్స్ కార్నర్ కి చెందిన చిన్నారులను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి అభినందించారు. మాంచెస్టర్ గ్లోబల్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న కూరపాటి సూర్య తేజ్ భట్, 6వ తరగతి చదువుతున్న కూరపాటి ధరణి తేజ్ భట్‌ను వేం నరేందర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించి, సన్మానించారు. విరాళాలు సేకరించిన అనంతరం త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డికి చిన్నారులు అందజేస్తారని తెలిపారు. గతంలోనూ ఈ చిన్నారులు కేరళలో తుఫాన్లు సంభవించినప్పుడు విరాళాలు సేకరించి ఆ స్కూల్ యాజమాన్యానికి అందించడం జరిగిందని, ప్రతి పౌరుడూ సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని సూచించారు. పిల్లలు చేస్తున్న మంచి పనిని అభినందించి ఆశీర్వదించారు. విద్యార్థులను వెన్నంటి ప్రోత్సాహిస్తున్న తల్లిదండ్రులైన కూరపాటి నరసింహారాజు, గీతాస్రవంతిని ఆయన అభినందించారు.

# శబరిమల భక్తుల కోసం 'స్వామి' ఏఐ చాట్‌బాట్

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**



కేరళలోని శబరిమల ఆలయానికి మండల మకరవిళక్కు సీజనులో లక్షల్లో తరలివచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కొత్త సాంకేతికతను వాడుతున్నారు. ఈ క్షేత్రానికి ఏటా పెరుగుతున్న రద్దీతో పలు సవాళ్లు ఎదురవుతున్నాయి. భక్తుల వసతి, భద్రత, క్యూల నిర్వహణ ఎంతో ముఖ్యం. ఆలయ సమయాలు, ఆయా మార్గాల వివరాలు, యాత్రికుల సమూహాలకు సంబంధించిన కచ్చితమైన సమాచారం అందుబాటులో లేక భక్తులు గందరగోళానికి గురవుతుంటారు.వాతావరణ సమాచారం లేకపోవడం వల్ల ముఖ్యంగా వర్షాకాలంలో, ట్రెక్కింగ్ సమయంలో భక్తులు తరచూ ప్రమాదాలకు గురవుతుంటారు. వీటికితోడు భాషాపరమైన సమస్యలు. ఆ సవాళ్లను అధిగమించేందుకు పథనంథిట్ట జిల్లా కలెక్టర్ ప్రేమ్ కృష్ణన్ నేతృత్వంలో వాట్సాప్ ఆధారిత ఏఐ చాట్‌బాట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనికి స్వామి అని పేరు పెట్టారు. భక్తులకు ముఖ్యమైన, కచ్చితమైన సమాచారాన్ని అందించడమే ఈ చాట్‌బాట్ లక్ష్యం. యూజర్ ఫ్రెండ్లీగా పలు భాషల్లో ఇది సేవలందిస్తుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ నవంబరు 13న దీన్ని ఆవిష్కరించారు. భక్తులందరికీ చేరేలా మీడియా, ఎఫ్ఎం రేడియో, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఐదు వారాల్లోనే 1.5 లక్షల మంది భక్తులు అనుసంధానమైనట్లు అధికారులు తెలిపారు.మరోవైపు, మండల పూజ సందర్భంగా శబరిమలలో స్వామి వారిని ఊరేగింపుగా తీసుకొచ్చిన థంకా అంకితో అలంకరించారు. ఆలయంలో దీపారాధన నిర్వహించారు. అంతకుముందు ఊరేగింపుగా తీసుకొచ్చిన థంకా అంకిని సన్నిధానం వద్ద మంత్రి వీఎన్ వాసవన్, దేవస్వోమ్ బోర్డు అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్, దేవస్వోమ్ బోర్డు సభ్యులు, ఇతర అధికారులు స్వాగతం పలికారు. ఆలయ మెట్ల వద్ద తంత్రి కందరారు రాజీవరు, మేల్శాంతి అరుణ్ కుమార్ నంబూతిరి, సహాయ అర్చకులు తంక అంకిని లాంఛనంగా స్వీకరించి ఆలయం లోపలికి తీసుకెళ్లారు. సాయంత్రం 6.30 గంటలకు మహా దీపారాధన నిర్వహించారు. థంకా అంకిని అలంకరించి, స్వామి దర్శనానికి భక్తులకు అవకాశం కల్పించారు.అయితే శబరిమల స్వామి అయ్యప్ప ఆలయ వార్షిక తీర్థయాత్ర మొదటి దశ ముగింపును సూచించే కీలకమైన మండల పూజ గురువారం జరగనుంది. ఆలయ తంత్రి (ప్రధాన పూజారి) కందరారు రాజీవరు ఆధ్వర్యంలో మధ్యాహ్నం నుంచి 12.30 గంటల మధ్య పూజలు నిర్వహించనున్నారు. మండల పూజ, నెయ్యభిషేకం తర్వాత ఆలయం డిసెంబర్ 26వ రాత్రి 11 గంటలకు మూసివేయనున్నారు. మకరవిళక్కు ఉత్సవాల కోసం డిసెంబర్ 30వ తేదీ సాయంత్రం తిరిగి తెరవనున్నారు. డిసెంబర్ 23 నాటికి ఈ సీజన్‌లో మొత్తం 30,87,049 మంది యాత్రికులు అయ్యప్ప ఆలయాన్ని సందర్శించారు. గతేడాదితో పోలిస్తే సుమారు 4.46 లక్షల మంది భక్తులు పెరిగారు.

# పొట్టి డ్రెస్సులో గ్లామరస్ దివి



తెలుగు సినీ పరిశ్రమలో టాలెంట్ తో ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ దివి వద్త్యా తన లేటెస్ట్ లుక్స్‌తో కూడా సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా నిలుస్తోంది. హంపిలో దిగిన ఆమె లేటెస్ట్ ఫోటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. గులాబీ రంగు షార్ట్ డ్రెస్సులో దివి స్టన్నింగ్‌గా కనిపిస్తూ నెటిజన్ల మనసులను దోచుకుంది. అందానికి తగ్గ ఫోటోషూట్‌తో ఆమె అందరినీ ఆకట్టుకుంది.హంపిలోని ఒక విగ్రహం ముందు దిగిన ఈ ఫోటోలు దివి క్యూట్‌నెస్‌ను మరింత హైలైట్ చేశాయి. గ్లామర్‌తో పాటు, ఆత్మవిశ్వాసం కలగలిపిన దివి తన లుక్‌తో కొత్తగా కనిపిస్తోంది. వీటిలో సింప్లిసిటీ, స్టైల్ కలగలిపినట్టుగా కనిపిస్తున్న ఫోటోలు ఆమె అభిరుచిని స్పష్టం చేస్తున్నాయి. ఈ లుక్స్‌తో దివి ఫ్యాన్స్ ఫాలోయింగ్ మరింత పెరుగుతోంది.ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో దివి యాక్టివ్‌గా ఉంటూ తన అభిమానులకు మరింత దగ్గరవుతోంది. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోషూట్లు, వ్యక్తిగత అప్డేట్లను పంచుకుంటూ సోషల్ మీడియాలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ తాజా ఫోటోలపై ఆమె ఫ్యాన్స్ "ఫాంటాస్టిక్ లుక్," "స్టన్నింగ్ బ్యూటీ" అంటూ కామెంట్స్ పెడుతున్నారు. దివి లుక్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. దివి కెరీర్ విషయానికి వస్తే, బిగ్ బాస్ షో ఆమెకి మంచి బూస్ట్ ఇచ్చింది. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సినిమాల్లో కనిపించినప్పటికీ, ఆమె హీరోయిన్ గా కొన్ని మంచి అవకాశాలను అందుకుంది. 'లంబసింగి' మూవీ, 'ఏటీఎం' వెబ్ సిరీస్ లాంటి ప్రాజెక్ట్‌లతో తన ప్రతిభను నిరూపించుకుంది. అయితే, దివి ఇంకా హీరోయిన్ గా తన ప్రత్యేకతను పూర్తి స్థాయిలో నిరూపించుకోవాలని చూస్తోంది. గ్లామర్ ప్రాజెక్ట్స్‌తో పాటు, నటిగా ప్రత్యేకతను చూపించే సినిమాల్లో అవకాశాలు అందుకోవడంపై దివి దృష్టి పెట్టింది. ఫిట్‌నెస్, ఫ్యాషన్, నటనతో పాటు, ఆమె కాన్ఫిడెన్స్ కూడా ప్రేక్షకులను ఆకర్షిస్తోంది.



# నేను పాడతా

సంక్రాంతికి వస్తున్నాం' పాటలు ఇప్పటికే మార్మోగుతున్నాయి. రెండు పాటలు విడుదల కాగా, త్వరలోనే మూడో పాటని విడుదల చేయనుంది చిత్రబృందం. సంక్రాంతి నేపథ్యంలో వచ్చే ఈ పాటని కథానాయకుడు వెంకటేశ్ స్వయంగా ఆలపించారు. నేను పాడతా... నేను పాడతా... అంటూ పట్టుబట్టి మరీ ఈ పాటని ఆలపించినట్టు చిత్రబృందం విడుదల చేసిన ప్రత్యేకమైన వీడియో స్పష్టం చేస్తోంది. ఈ పాటని ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో, నృత్య దర్శకుడు భాను నేతృత్వంలో తెరకెక్కిస్తున్నారు. త్వరలోనే పాటని విడుదల చేయనున్నారు. వెంకటేశ్ కథానాయకుడిగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలు. శిరీష్ నిర్మిస్తున్నారు. దిల్‌రాజు సమర్పకులు. జనవరి 14న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాకి భీమ్స్ సిసిరోలియో స్వరకర్త.

## sports స్పోర్ట్స్

# సెమీస్‌లో యూపీ, పట్నా



ప్రో కబడ్డీ సీజన్-11 యూపీ యోధాస్, పట్నా పైరేట్స్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లాయి. భవానీ రాజ్‌పుత్ (12) అదరగొట్టడంతో గురువారం ఎలిమినేటర్‌లో యూపీ 48-18తో జైపుర్ పింక్ పాంథర్స్‌ను చిత్తు చేసింది. ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన యూపీ.. విరామ సమయానికి 23-8తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. బ్రేక్ తర్వాతా జైపుర్ పుంజుకోలేకపోయింది. మరోవైపు అదే జోరు కొనసాగించిన యూపీ తేలిగ్గా విజయాన్ని అందుకుంది. ఇంకో ఎలిమినేటర్‌లో పట్నా పైరేట్స్ 31-23తో యు ముంబాను ఓడించింది. తొలి అర్ధభాగంలో ముంబా కాస్త పోటీ ఇచ్చినా.. పట్నా 17-11తో పైచేయి సాధించింది. బ్రేక్ తర్వాత ముంబా పుంజుకున్నా.. పట్నా పట్టు వదల్లేదు. అయాన్ (10), దేవాంక్ (8) ఆ జట్టును గెలిపించారు. లీగ్ దశలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన హరియాణా, దిల్లీ ఇప్పటికే సెమీస్ చేరాయి.




# పడగొట్టినా కాస్త వెనకే..

బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో అత్యంత కీలకమైన నాలుగో టెస్టులో తొలి రోజు ఆతిథ్య ఆస్ట్రేలియానే స్వల్పంగా పైచేయి సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఆసీస్.. గురువారం ఆట చివరికి తొలి ఇన్నింగ్స్‌లో 311/6తో నిలిచింది. నాథన్ మెక్‌స్వీనీ స్థానంలో అవకాశం దక్కించుకున్న అరంగేట్ర ఆటగాడు సామ్ కొన్‌స్టాస్ (60; 65 బంతుల్లో 6×4, 2×6) మెరుపు ఇన్నింగ్స్‌తో అందరి దృష్టినీ తన వైపు తిప్పుకొన్నాడు. మార్నస్ లబుషేన్ (72; 145 బంతుల్లో 7×4), స్టీవ్ స్మిత్ (68 బ్యాటింగ్; 111 బంతుల్లో 5×4, 1×6), ఉస్మాన్ ఖవాజా (57; 121 బంతుల్లో 6×4) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఆట చివరికి స్మిత్‌కు తోడుగా కమిన్స్ (8) క్రీజులో ఉన్నాడు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా (3/75) మరోసారి ఆకట్టుకున్నాడు. రెండో రోజు ఉదయం ఆసీస్‌ను త్వరగా ఆలౌట్ చేయడమే కాక.. బ్యాటర్లు నిలకడగా ఆడితేనే మ్యాచ్‌లో భారత్ పైచేయి సాధించడానికి అవకాశముంటుంది. అయిదు టెస్టుల సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉన్న సంగతి తెలిసిందే




# విరాట్ కోహ్లీకి జరిమానా

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి ఐసీసీ షాక్ ఇచ్చింది. నాలుగో టెస్టులో ఆసీస్ ఆటగాడితో వాగ్వాదానికి దిగడంతో జరిమానా విధించింది. మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టులో ఆసీస్ అరంగేట్ర ఆటగాడు కాన్‌స్టాస్ ను కోహ్లీ కవ్వించేందుకు ప్రయత్నించాడు. దీంతో ఇద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. కాన్‌స్టాస్ భుజం తాకుతూ కోహ్లీ నడిచి వెళ్లడం వాగ్వాదానికి దారితీసింది. భారత క్రికెటర్ వ్యవహరించిర తీరును మాజీ క్రికెటర్లు తప్పుబట్టారు. ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకెల్ వాన్ స్పందించారు. వీరిద్దరూ కామెంట్రీ బాక్స్‌లో ఉన్నారు. అతడిపై మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. భారత మాజీలు సునీల్ గావస్కర్, రవిశాస్త్రి కూడా కోహ్లీ అలా ప్రవర్తించి ఉండాల్సికాదని అభిప్రాయపడ్డారు.ఈ క్రమంలో ఐసీసీ విరాట్ కోహ్లీపై చర్యలు తీసుకుంది. అతడిపై మ్యాచ్ నిషేధం విధించాలనే డిమాండ్లూ వస్తున్నాయి. అయితే, కోహ్లీ తప్పును అంగీకరించడంతో మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ జరిమానాతో సరిపెట్టాడు. లెవల్ 1 నేరానికి పాల్పడటంతో అతడికి మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధించారు. అలాగే విరాట్ ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను జోడించారు.ఆసీస్ యువ ఓపెనర్ కాన్‌స్టాస్ క్రీజ్‌లో ఉండగా.. జస్‌ప్రీత్ బుమ్రా ఇన్నింగ్స్ 11వ ఓవర్‌ను వేస్తున్నాడు. మూడు బంతులు ముగిశాయి. కోహ్లీ వద్దకు బాల్ వెళ్లింది. దానిని తీసుకుని నాన్‌స్ట్రైకర్ వైపు వస్తుండగా.. కాన్‌స్టాస్ స్ట్రైకింగ్ క్రీజ్ వైపు వెళ్తున్నాడు. వీరిద్దరూ ఎదురుపడగానే భుజాలు తాకాయి. దీంతో కాన్‌స్టాస్ ఏదో వ్యాఖ్యలు చేయడంతో కోహ్లీ కూడా దీటుగా స్పందించాడు. కొంతసేపు వాగ్వాదం నెలకొనడంతో.. ఉస్మాన్ ఖవాజా, అంపైర్లు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in